హరిః ఓం.

శ్రీగురుభ్యోనమః.

విశిష్టాద్వైతసంగ్రహము.

శ్రీరామానుజదర్శనము.

పించెను సబ్జడ్జి

వావిలాల వేంకటశివావధానులు, బి.ఏ. గారిచే

రచియింపఁబడినది.

మొదటికూర్పు 1000 ప్రతులు.

బెజవాడ వాణీ ముద్రాలయమున

బి. కే. స్వామిచే

ముద్రితము.

1919.

ప్రకటన

ఈ గ్రంథము నచ్చువేయించుటకు జీ. సీ. ఐ. ఈ. అండ్ సీ. బీ. ఈ. బిరుదాంకితులగు మహారాజరాజశ్రీ బొబ్బిలి మహారాజాలంగార్లు ద్రవ్యమిచ్చిరి గాన వార్లకు మిక్కిలి కృతజ్ఞుడను.

18—9—19,
మచిలీబందరు.

వావిలాల వేంకటశివావధాని.

హరిః ఓమ్.

శ్రీ గురుభ్యోనమః.

— స మ ర్ప ణ మ్ —

బ్రహ్మశ్రీ అన్నవరపు వేంకటరాఘవశాస్త్రి గురువర్య కరకమలేషు,

శ్లో॥ ప్రజ్ఞానిధే, ప్రకృతిసౌమ్య, మహర్షిమూర్తే,
భో భారతీతనయరత్న, గురో, నమస్తే,
త్వత్పాదధూనావససియద్యపిమాంసుదూరే,
త్వంమే తథాపి మనసోనహిదూరగోసి ॥

శ్లో॥ వినాభవంతం తవపుత్రకోహం
కస్మైమదీయాం కృతిముత్సృజామి ?
స్వహస్త సంవర్థిత పాదపస్య
ఫలం యథాగ్రంథ మిమం గృహాణ ॥

ప్రణత సేవకస్య
వావిలాల వేంకటశివావధానినః.

ఈ గ్రంథకర్తగారిచే తెనుఁగున రచియింపఁబడిన గ్రంథములు.

1	బ్రహ్మసూత్రసారము	౧ ప్రతికి వెల రు	1—4—0
2	శ్రీమద్భాగవతసారము	,,	1—8—0
3	విశిష్టాద్వైతసంగ్రహము	,,	0—6—0
4	శ్రీ విద్యారణ్యచరితము	అచ్చుపడవలయును.	
5	హరిలీల		
6	వేదశాస్త్రసంగ్రహము		
7	హిందూగృహము		

వీని ప్రతులు :—

(1) చెన్నపట్టణము, అడయారునందున్న థియసాఫికల్ పబ్లిషింగు హౌసులోను, (Theosophical Publishing House, Adyar, Madras),

(2) వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్సు, 192, ఎస్ప్లనేడు, మదరాసు లోను,

(3) రాంజీ అండ్ కంపెనీ, మచిలీపట్నములోను,

(4) పి. వి. రమణయ్య అండ్ సన్సు, గుంటూరులోను,

దొరకును.

హరిః ఓం.

శ్రీ గురుభ్యోనమః.

విశిష్టాద్వైత సంగ్రహము.

శ్రీ రామానుజ దర్శనము.

విషయసూచిక.

౯ ప్రపత్త్యధికారి యెవఁడు?

౧౦ "సర్వధర్మాన్ పరిత్యజ్య" అను వాక్యార్థవిచారము.

౧౧ 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకంశరణంవ్రజ' అను వాక్యములోని సర్వధర్మ స్వరూప త్యాగము శరణాగతికి అంగమా? కాదా?

౧౨ ప్రపత్తినిష్ఠుఁడు నిషిద్ధముల నాచరించినచో శరణాగతినిమాత్రమే చేయవలెనా? లేక మన్వాది స్మృత్యుక్తప్రాయశ్చిత్తములనుగూడ నాచరింపవలయునా?

౧౩ ప్రపన్నుఁడేనిమిత్తము కర్మములాచరింపవలయు ?

౧౪ ప్రపన్నుఁడు ప్రపత్తికిఁ బూర్వము నాచరించిన అంగములను ప్రపత్తియనంతరమాచరించ వలయునా? లేదా?

౧౫ ప్రపన్నులకందఱకు భగవదనుగ్రహము కలదా? లేదా?

౧౬ ప్రపన్నులలో జాతినియమముకలదా? లేదా?

౧౭ ఈశ్వరుఁడణువగు జీవుని యాంతరమందు వ్యాపించియుండునా? లేదా?

౧౮ పంచాగ్ని విదుల ప్రాప్యస్థానము బ్రహ్మాండాంతర్గతమా? కాదా?



హరిః ఓం.

శ్రీగురుభ్యోనమః.

విశిష్టాద్వైతసంగ్రహము

—* శ్రీరామానుజదర్శనము *—

శ్లో॥ లక్ష్మీనాథసమారంభాం నాథయామునమధ్యమాం
అస్మదాచార్యపర్యంతాం వందేగురుపరంపరాం ॥

శ్లో॥ సమ్యఙ్న్యాయకలాపేన మహతా భారతేనచ
ఉపబృంహితవేదాయ నమోవ్యాసాయవిష్ణవే ॥

శ్లో॥ తస్మై రామానుజార్యాయ నమఃపరమయోగినే
యశ్శ్రుతిస్మృతిసూత్రాణా మన్తర్జ్వరమశీశమత్ ॥

శ్లో॥ శ్రీమద్రాఘునతీర్థానాం పదపంకేరుహస్మృతిః
స్మృతిమవ్యాహతాంకుర్యాత్ సదాపదపదార్థయోః ॥

శ్రీమతేరామానుజాయనమః.

—* ౧ — చిదచిదీశ్వర స్వరూపములు *—

శ్రీవిశిష్టాద్వైతమని పేర్కొనఁబడి శ్రీరామానుజాచార్యాదుల వ్యక్తీకరింపఁబడిన శ్రీవైష్ణవసిద్ధాంతస్వరూపమిందు సంగ్రహించెద ను. ఈ సిద్ధాంతమునందు తత్త్వములు మూఁడు :—అచిత్తు, చిత్తు, ఈశ్వరుఁడు. అచిత్తు మూఁడు తెఱంగులు :—శుద్ధసత్త్వము, సత్త్వశూన్యము, మిశ్రసత్త్వమనుప్రకృతి. శుద్ధసత్త్వము పరమపదమందు

గోపురమంటపప్రాకారభోగ్యభోగోపకరణభోగస్థానములుగఁ బరిణామము కలిగియుండును. భగవంతునియొక్కయు, నిత్యముక్తులయొక్కయు, విగ్రహములును శుద్ధసత్త్వమయములు. శుద్ధసత్త్వము జడమనికొందఱు, అజడమనికొందఱు, చెప్పుదురు. అజడమే ముఖ్యపక్షము. సత్త్వశూన్యమనఁ గాలము. ఇది మహాయుగ సంవత్సర ఋతు మాస దివస ముహూర్తాది భేదములు కలదై యుండును. ప్రకృతియనఁ ద్రిగుణాత్మకమగు ప్రధానము. సత్త్వరజస్తమోగుణమిశ్రము గనుక దీనిని మిశ్రసత్త్వమనుదురు. ఇది మహదాది పృథివ్యంతచతుర్వింశతి తత్త్వాత్మకమై లీలావిభూతియని చెప్పఁబడి ప్రపంచమునకుఁ గారణమై యుండును.

చిత్తనఁగ జీవుఁడు. ఇతఁడు మూఁడువిధములు :—బద్ధుఁడు, ముక్తుఁడు, నిత్యుఁడు. బద్ధుఁడన సంసారమండలములోనుండి పుణ్యపాపముల ననుష్ఠించుచుఁ దత్ఫలము ననుభవించువాఁడు. ముక్తుఁడనఁగా భక్తిప్రపత్తుల నాచరించి, అర్చిరాది మార్గముగుండా పరమపదమునకుఁ బోయి నిరంతర భగవదనుభవపరుఁడై యుండువాఁడు. నిత్యుఁడన సర్వదా సంసార గంధరహితుఁడై నిరంతర భగవదనుభవపరుండై యుండువాఁడు. వీరు ముగ్గురును, నొక్కఁడొక్కఁడ నేకులుగా నుందురు. జీవుల స్వరూపము జ్ఞానాత్మకము, జ్ఞానగుణకము; అనఁగ వీరు జ్ఞానమే స్వరూపముగఁ గలవారును, జ్ఞానమే గుణముగఁ గలవారును, నయి యున్నారు. జీవుని పరిమాణమణువు.

ఈశ్వరుఁడన, పరమాత్మ. ఆతఁడొకఁడైనను పరవాసుదేవుఁడుగను, వాసుదేవసంకర్షణప్రద్యుమ్నానిరుద్ధ నామములుగల నాలుగు వ్యూహములను సంస్థానవిశేషములుగను, నుండును. పరవాసుదేవుఁడు ముక్తప్రాప్యుఁడు. ప్రద్యుమ్నానిరుద్ధ సంకర్షణ వ్యూహములు వరుసఁగ జగత్తుయొక్క సృష్టిస్థితిసంహారములకుఁ గారణములు. ఈశ్వరుని స్వరూపము జ్ఞానానందాత్మకము, జ్ఞానగుణకము :—అనఁగ నీశ్వరుని స్వరూపము జ్ఞానము, ఆనందము ; మఱియు జ్ఞానమును, ఆనందమును,

గలవాఁడు. ఈశ్వరుఁడు విభువు (సర్వవ్యాపకుఁడు). ఈశ్వరుఁ డనంత కల్యాణగుణాకరుఁడేగాక హేయగుణరహితుఁడు.

—* ౨ – శ్రుతిస్మృతిసమన్వయము *—

చిదచిదీశ్వరులగు నీమూఁడు తత్త్వములు వరుసఁగా భోక్తృ, భోగ్య, నియంతృ, స్వభావములచే స్వరూపభేదములను గలిగియున్నవని కొన్ని శ్రుతులు (వేదవాక్యములు) వక్కాణించుచున్నవి :—(శ్వేతాశ్వతరోపనిషత్తులో) "అస్మాన్మాయీ సృజతే విశ్వమేతత్తస్మింశ్చాన్యో మాయయా సన్నిరుద్ధః"=ప్రకృతియగు మాయతోఁగూడుకొనిన యీశ్వరుఁడీ మాయవలననే యీప్రపంచమును సృజించుచున్నాఁడు. ప్రకృతిపరమాత్మలకంటె నన్యుఁడగు జీవుఁడా ప్రపంచమందు మాయచే నిరోధింపఁబడి యున్నాఁడు. "మాయాంతు ప్రకృతిం విద్యాన్మాయినంతు మహేశ్వరం"=మాయయన, ప్రకృతి, మాయావిశిష్టుఁడన, ఈశ్వరుఁడనియుఁ, దెలియవలయు. మొదటి శ్రుతిలో 'అన్య' శబ్దమున కర్థము జీవాత్మ. "క్షరంప్రధానం" అను శ్రుతి దానిని విశదీకరించుచున్నది. "క్షరంప్రధాన మమృతాక్షరం హరః క్షరాత్మానావీశతే దేవఏకః"= ప్రకృతిక్షరము, జీవుఁడమృతాక్షరము, ప్రకృతిజీవుల నిద్దఱను నొక దేవుఁడే యా యా కార్యములందు నియమించుచుండును. ఇచ్చటఁ బ్రధానమును దనకు భోగ్యముగ గ్రహించు చున్నందున 'హర' శబ్దముచే జీవుఁడు చెప్పఁబడుచున్నాఁడు. జీవునకు నాశములేనందున 'అమృత' మనియు అనఁగ స్వరూపపరిణామము (మారుట) లేనందున 'అక్షర' మనియుఁ జెప్పఁబడెను. "వ్యక్తావ్యక్తం భరతే విశ్వమీశః"=ప్రకృతి జీవాత్మకమగు విశ్వమును నీశ్వరుఁడు భరించుచున్నాఁడు. ఇచటఁ బ్రకృతిజీవులు (ధరింపఁబడువారు) ధార్యులనియు, ఈశ్వరుఁడు (వారిని ధరించువాఁడు) ధారకుఁడనియు, భేదము బోధింపఁబడినది. "సకారణం కరణాధిపాధిపో నచాస్యకశ్చిజ్జనితా నచాధిపః" = ఆ యీశ్వరుఁడు జగత్తునకుఁ గారణము, నింద్రియముల కధిపతియగు జీవునకుఁ బ్రభువును, గాని యీ

యీశ్వరునకుఁ గారణముగాని యధిపతిగాని యింకొకఁడు లేఁడు. ఇచ్చటఁ బరమాత్మకు నీశ్వరత్వము (నియామకత్వము = నియమించు ధర్మము), జీవుల కీశితవ్యత్వము (నియామ్యత్వము = నియమింపఁబడు ధర్మము)ను, జెప్పుటచే జీవేశ్వరులకు భేదమును జెప్పఁబడెను. "ప్రధాన క్షేత్రజ్ఞపతిర్గుణేశః" = ప్రకృతికిని జీవులకును ప్రభువు, సత్వరజస్తమోగుణములకు నియామకుఁడును. ఈ శ్రుతిచేఁ 'కరణాధిపాధిప' శబ్దము వివరింపఁబడినది. "పతింవిశ్వస్యాత్మేశ్వరగ్ం శాశ్వతగ్ం శివమచ్యుతం" = పరమాత్మ విశ్వమునకుఁ బతియును, జీవాత్మల నీశ్వరుఁడును, నిత్యుఁడును, మంగళస్వరూపుఁడును, వినాశము లేనివాఁడును. ఈ శ్రుతి పరమాత్మకు మఱియొక యీశ్వరుఁడు లేఁడనియు, జగత్తతనికి శేషమనియు, దానికిఁ బరమాత్మ శేషియనియు, నిట్టి భేదమును నిరూపించుచున్నది. ఇచ్చటి 'పతి' శబ్దము శేషివాచకముగాని రక్షకవాచకముకాదు. 'పతి' శబ్దము శేషియందు రూఢముగదా. శేషిశేషముల లక్షణములు ముందు వివరింపఁబడును. "జ్ఞాజ్ఞౌ ద్వావజావీశానీశౌ" = జన్మరహితులగు నీశ్వరజీవులలో నొకఁడు సర్వజ్ఞుఁడు, మఱియొకఁడు కించిజ్జ్ఞుడు; ఒకఁడు నియంత, రెండవవాఁడు నియమ్యుఁడు. ఈ శ్రుతి కించిజ్జ్ఞత్వ సర్వజ్ఞత్వాదులచేఁ జీవేశ్వరులకు భేదమును బ్రదర్శింపుచున్నది. 'ద్వౌ' అనుశబ్దముచేత నారెంటికి స్వరూపభేదము గూడ సూచింపఁబడుచున్నది. "నిత్యో నిత్యానాం చేతనశ్చేతనానామేకో బహూనాం యోవిదధాతి కామాన్" - నిత్యులును, చేతనులును, నగు ననేక జీవులకు నిత్యుఁడును, చేతనుఁడును, నగు నొకఁడైన యీశ్వరుఁడు కర్మఫలముల నిచ్చుచున్నాఁడు. ఈ శ్రుతి జీవేశ్వరులకు నుత్పత్తి ప్రళయములు లేవనియు, జీవులకుఁ గర్మఫలభోక్తృత్వమును, ఈశ్వరునకుఁ గర్మఫలదాతృత్వమును, నను భిన్నధర్మములుకలవనియుఁ, బ్రతిపాదింపుచున్నది. "భోక్తాభోగ్యం ప్రేరితారంచ మత్వా"=భోక్తయగు జీవుఁడు, భోగ్యమగు ప్రకృతిని, ప్రేరకుఁడైన పరమాత్మను, దెలిసికొని ముక్తి నొందును. ఈ శ్రుతి జీవప్రకృతి పరమాత్మలకు భోక్తృభోగ్యనియంతృత్వములచేత భేదమును బోధించుచున్నవి. "తయోరన

న్యః పిప్పలం స్వాద్వత్త్య నశ్నన్నన్యో అభిచాకశీతి"=జీవేశ్వరులలో
నొకఁడైన జీవుఁడు కర్మఫలము ననుభవించుచున్నాఁడు. మఱియొకఁడైన
యీశ్వరుఁడా ఫలము ననుభవింపక ప్రకాశించుచున్నాఁడు. ఈ శ్రుతి
జీవేశ్వరులకుఁ గర్మఫలభోక్తృత్వాభోక్తృత్వములచేత భేదమును నిర్దేశిం
చుటయేకాక యీశ్వరస్వరూపము దోషస్పర్శము లేనిదనియును, నుద్ఘో
షించుచున్నది. "పృథగాత్మానం ప్రేరితారంచ మత్వా జుష్టస్తతస్తేనామృ
తత్వమేతి"=జీవాత్మను పరమాత్మను వేఱుగఁ దెలిసికొని యట్టి జ్ఞానము
తోఁగూడినవాఁడై ముక్తి నొందును. ఈ శ్రుతి భేదజ్ఞానము మోక్ష
సాధనమని నుడువుచున్నది. "అజామేకాం లోహిత శుక్లకృష్ణాం బ
హ్వీః ప్రజాం జనయంతీగ్ం సరూపాం అజోహ్యేకో జుషమాణోను శేతే
జహాత్యేనాం భుక్తభోగామజోన్యః"=ప్రకృతి జీవులు ముగ్గురకు
జన్మము లేదు గాన 'అజుల' నఁబడుదురు. వారిలో ప్రకృతియను 'నజ'
రజస్సత్వతమోగుణములను రక్తశుక్లనీలవర్ణములు కలిగి, తన
తో సమానగుణములు గల ప్రజల ననేకులను బుట్టించుచుండును.
ఇట్టి ప్రకృతిని నొక యజుఁడగు బద్ధజీవుఁ డనుభవించుచు దానినే
యనుసరించును. మఱియొక అజుఁడగు ముక్తజీవుఁడు కొంతకా
లము ప్రకృతి ననుభవించి విడుచును. ఈ శ్రుతియును ప్రకృతి జీవు
ల భేదమును దెలుపుచున్నది. దీనిని విచారించవలయును. "స
మానే వృక్షే పురుషో నిమగ్నః అనీశయా శోచతి ముహ్యమానః
జుష్టం యదా పశ్యత్యన్యమీశమస్య మహిమాన మితి వీతశోకః"
=జీవుఁడు తనకు నీశ్వరునకు సమానాశ్రయమయిన దేహమందు
నభిమానముకలవాఁడై భగవచ్ఛేషత్వజ్ఞానము లేనందున మోహితుఁ
డై దుఃఖించుచున్నాఁడు. ఎప్పుడు సకల జీవులయందుఁ బ్రేమకలవాఁడై
సకల చేతనాచేతన విలక్షణుఁడై యున్న పరమాత్మను, అతనియొక్క
సకల జగద్ధారణాది ప్రభావమును, దెలిసికొనునో, అప్పుడు సమస్త
దుఃఖవినిర్ముక్తుఁడై ముక్తిని జెందును. ఈ శ్రుతి జీవేశ్వరులకు స్వత
సిద్ధముగ భేదము కలదనియు, తారతమ్యము గలదనియు, విశదీకరించు
చున్నది. ఇటువంటి శ్రుతు లనేకములు గలవు.

స్మృతివచనములుకూడ నిట్టి యర్థమునే ప్రతిపాదించు చున్నవి. "భూమి రాపోఽ నలో వాయుః ఖంమనోబుద్ధి రేవచ। అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతి రష్టధా। అపరేయ మిత స్త్వన్యాం ప్రకృతిం విద్ధిమే పరాం। జీవభూతాం మహాబాహో య యేదం ధార్యతే జగత్" = (గీతా- ౭ అ- ౫,౬శ్లో.) నేల, నీరు, నిప్పు, గాలి, ఆకాశము, మనస్సులోనగు నింద్రియవర్గము, మహాత్తత్వము, అహంకారము, అను నెనిమిది భేదములు గలిగిన విచిత్ర ప్రపంచమునకు నుపాదానకారణమైన ప్రకృతియే నా సంబంధమయిన "అపరాప్రకృతి". ఇంతకంటె విలక్షణమైన మఱియొక ప్రకృతి గలదు. దానినే 'పరాప్రకృతి' యనియు, జీవాత్మయనియును, దెలియుము. దానిచేతనే యీ యచేతనజగత్తు ధరింపఁబడుచున్నది. ఎనిమిది విధములుగా నున్న ప్రకృతి నా సంబంధమని భగవంతుఁ డర్జునునకుఁ జెప్పుటచేఁ గారణదశయందును, ప్రకృతిజీవపరమాత్మలకు భేదము సిద్ధించుచున్నది. "సర్వభూతాని కౌంతేయప్రకృతిం యాంతి మామికాం। కల్పక్షయే పునస్తానికల్పా దౌ విసృజామ్యహం" = (గీ౯-౭) ప్రళయకాలమందు స్థావరజంగమాత్మకములగు భూతము లన్నియు నా శరీరముగా నుండు ప్రకృతిని గూర్చి ప్రవేశించును; తిరిగి సృష్టికాలమందు నేనే వానిని సృజించుచున్నాను. ఇచ్చటఁగూడ నా శరీరమయిన ప్రకృతిని గూర్చి భూతములు ప్రళయకాలమందుఁ బ్రవేశించుచున్నందున, పూర్వోక్తార్థమే సిద్ధించుచున్నది. "ప్రకృతిం స్వామవష్టభ్యవిసృజామి పునః పునః భూతగ్రామ మిమం కృత్స్నమవశం ప్రకృతే ర్వశాత్॥ (గీ-౯-౮) = నా సంబంధమైన ప్రకృతి నెనిమిదివిధములుగఁ బరిణమింపఁజేసి, గుణత్రయాత్మకమైన నా ప్రకృతికిలోఁబడియుండు దేవతిర్యఙ్మనుష్యాది స్థావరములగు చతుర్విధభూతములను సృష్టికాలములందు మాటిమాటికి సృజించుచున్నాను. ఈ శ్లోకమందును, పూర్వోక్తార్థమే సిద్ధించుచున్నది, "మయాధ్యక్షేణ ప్రకృతిస్సూయతే సచరాచరం। హేతునానేన కౌంతేయ జగద్విపరివర్తతే" (౯-౧౦) = నా ప్రకృతికి నధిష్ఠాతనైన నాచేఁ జూడఁబడి చరాచర

ప్రపంచమును ప్రకృతి సృజించుచున్నది. నాయీ యాత్మణముచేతనే ప్రపంచము మారుచున్నది. ఈ శ్లోకమందు ప్రకృతి పరమాత్మలకు స్వాభావ సాంకర్యరాహిత్యమును, కారణావస్థయందుఁగూడ భేదసద్భావమును, సిద్ధించుచున్నవి. "ప్రకృతిం పురుషంచైవ విద్ధ్యనాదీ ఉభావపి" (గీ ౧౩-౨౦) = ప్రకృతి జీవుల నిద్దఱ ననాదులుగాఁ దెలియుము. ఇచ్చట వారి యనాదిత్వముకంఠరవముతోఁ జెప్పఁబడినది. "మమ యోనిర్మహద్బ్రహ్మ తస్మిన్ గర్భం దధామ్యహం, సంభవస్సర్వభూతానాం తతోభవతిభారత" (౧౪-౩) = జగత్కారణభూతమై మహదహంకారాదులకుఁ గూడఁ గారణమైనందున మహద్బ్రహ్మమని చెప్పఁదగినదియయి ప్రకృతియనియు, భూతసూక్ష్మమనియు, వ్యవహరింపఁబడు నచిత్తునందు నేను చేతనమగు గర్భమును గూర్చుచున్నాను. దానిచే దేవాదిభూత సముదాయము సంభవించుచున్నది.

ఈవిధముగా సర్వావస్థలందు భోక్తృభోగ్యరూపములతోనున్న చిదచిత్తులు పరమాత్మకుశరీరముగాను, నియమ్యములుగాను, నున్నందున, పరమాత్మకంటెఁ బృథక్స్థితి లేనివనియు, పరమాత్మ చిదచిత్తులకు నాత్మగనున్నాఁడనియు, కొన్ని శ్రుతులు ప్రతిపాదించుచున్నవి."యఃపృథివ్యాంతిష్ఠన్ పృథివ్యా మంతరోయంపృథివీనవేదయస్యపృథివీ శరీరం యఃపృథివీ మంతరోయ మయత్యేషత ఆత్మాంతర్యామ్యమృతః"= ఎవఁడు భూమియందున్నవాఁడై, భూమిలోనుండునో, యెవనిని పృథివ్యభిమానదేవత యెఱుఁగదో, యెవనికి భూమిశరీరమో, యెవఁడు భూమిలోపలనుండి భూమిని నియమించుచుండునో, అతఁడు నీకు నాత్మయు, నంతర్యామియును, అతఁడు నాశము లేనివాఁడును. "యఆత్మనితిష్ఠన్ ఆత్మనోంతరోయమాత్మానవేదయస్యాత్మా శరీరం య ఆత్మాన మంతరోయ మయత్యేషత ఆత్మాంతర్యామ్యమృతః"=ఎవఁడు జీవునియందున్నవాఁడై జీవునిలోపల నుండునో, యెవనిని జీవుఁడెఱుఁగడో, యెవనికి జీవుఁడు శరీరమో, యెవఁడు జీవునిలోపలనుండి యతనిని నియమించుచుండునో; అతఁడు వినాశము లేనివాఁడు. ఇట్లు బృహదారణ్యోపనిషత్తులోని అంతర్యామి బ్రాహ్మణము చెప్పుచున్నది. సుబాలోపనిషత్తులో

"యఃపృథివీమంతరే సంచరన్ యస్యపృథివీ శరీరం యం పృథివీ న వే
ద" అని యారంభించి "యోఽక్షరమంతరే సంచరన్ య
శరీరం యమక్షరం న వేద యో మృత్యుమంతరే సంచరన్ యస్యమృ
త్యుశ్శరీరం యం మృత్యుర్న వేద ఏష సర్వభూతాంతరా
హత పాప్మా దివ్యోదేవ ఏకోనారాయణః" అని చెప్పబడిన
ఎవఁడు పృథివిలో సంచరించుచున్నాఁడో, యెవనికిఁ బృథివి శరీరము
యున్నదో, యెవనిని పృథివీదేవత యెఱుఁగదో......ఎవఁడ క్షరము
సంచరించుచున్నాఁడో, ఎవని కక్షరము శరీరమో, ఎవ్వని
ఱుఁగదో, ఎవఁడు మృత్యువునందు సంచరించుచున్నాఁడో, ఎవనికి
మృత్యువు శరీరమో, ఎవ్వనిని మృత్యువెఱుఁగదో, అతఁడు సర్వభూ
తముల కంతరాత్మయును, సర్వపాపములయొక్క స్పర్శము
ను (ఎవనిని సర్వపాపములంటవో), స్వయంప్రకాశుఁడును.
ణుఁడును, అని చెప్పఁబడు దేవుఁడు. ఇచ్చట 'మృత్యు' శబ్దము
వాచ్యమై సూక్ష్మదశను బొందియున్న 'అచిద్వస్తువు' చెప్పఁబడుచున్న
ది. ఈ యుపనిషత్తునందే "అక్షరంతమసిలీయతే" అని వినఁబడుచున్న
ది. అనఁగా, అక్షరము తమస్సునందు లీనమగును. ఈ తమస్సు పూ
ర్వవాక్యమందున్న 'మృత్యు' శబ్దముచేఁ జెప్పఁబడినదని
దగియున్నది. "అంతఃప్రవిష్టశ్శాస్తా జనానాగ్ం సర్వాత్మా"
కుఁడైన పరమాత్మ సకలజనులయొక్క హృదయమందుఁ బ్రవేశించి
శిక్షించును. ఈ శ్రుతియును జీవేశ్వరులకు శరీర శరీరిభావమును బో
ధించుచున్నది. ఇవి ఘటకశ్రుతులు - అనఁగ భేదశ్రుతులకును, న
శ్రుతులకును,నగపడువిరోధమును శమింపఁజేసి, యేకార్థత్వము సంపా
దించునవి. ఈప్రకారము సర్వావస్థలయందును, చిదచిత్తులు శరీరము
లుగఁగలిగియున్నందున, పరమాత్మయే,కార్యదశను, కారణ
దియుండి, అనఁగ సృష్టికిఁ బరమందు స్థూలరూపమును,
ర్వము సూక్ష్మరూపమునుఁ బొంది యుండు జగదా
నిలచి యున్నాఁడు. ఈ యర్థమును నిరూపించుటకుఁ శ్రు
తులు కార్య కారణ దశలను బొందిన ప్రపంచము పరమాత్మయే

గ్రమని నిర్దేశించుచున్నవి. అవి యేవియన :— " సదేవసోమ్యేద మగ్ర ఆసీత్, ఏకమేవా ద్వితీయం, తదైక్షత బహుస్యాం ప్రజా యేయేతి, తత్తేజోఽసృజత" అనియారంభించి "సన్మూలాస్సోమ్యేమాస్సర్వాః ప్రజా స్సదాయతనా స్సత్ప్రతిష్ఠాః ఐతదాత్మ్య మిదం సర్వం తత్సత్యం, సఆత్మా, తత్త్వమసి" ఇత్యాది శ్రుతులు. ఈలాగుననే "సోఽకామయత బహుస్యాం ప్రజాయేయేతి, సతపోఽతప్యత, సతప స్తప్త్వా, ఇదగ్ం సర్వమసృజత" అని మొదలుపెట్టి "సత్యంచానృతంచ సత్యమభవత్" ఇత్యాది శ్రుతులును,=ఓచంద్రునివంటి ప్రియదర్శనుఁడా, యీ యగపడు జగత్తు సృష్టికి ముందు సద్వస్తువుగానే యుండెను. ఆ సద్వస్తువు సహకారి కారణాంతరము, నిమిత్తకారణాంతరము, ఉపాదానకారణాంతరము, లేనిదై యుండెను. ఆ సద్వస్తువే యనేకముగ నగుదుననియుఁ, బుట్టుదుననియు, నిరీక్షించెను (ఆలోచించెను). నిరీక్షించి ఆ సద్వస్తువు తేజస్సును సృజించెను. ఓసౌమ్యుఁడా, ప్రజలందఱు సద్వస్తుమూలముగాఁగలవారు, సద్వస్తువేయాధారముగాఁ గలవారు, సద్వస్తువే ప్రతిష్ఠగాఁ గలవారు; ఈప్రపంచమంతయు సద్వస్తువే ఆత్మగాఁ గలది. సత్య మదియే యాత్మ. నీవును నాసద్వస్తువగు బరమాత్మవే. ఆపరమాత్మ యనేకమగుదుననియు, పుట్టెదననియు, కామించెను (తనలోఁ దానే కోరెను). తర్వాత నాపరమాత్మ తపస్సు చేసెను (యోచించెను). అతఁడు తప మొనరించి యీ జగత్తునంతను సృజించెను. ఆ సత్యమైన పరమాత్మ సత్యమని చెప్పఁదగిన చిత్ప్రపంచమును, అనృతమని చెప్పఁదగిన అచిత్ప్రపంచమును, దానే యాయెను, అని యీ యుదాహృతశ్రుతుల కర్థము.

వీనియందును, బూర్వశ్రుతులందును, జెప్పఁబడిన చిదచిదీశ్వర స్వరూపభేదము స్మరింపఁజేయఁబడినది. " హంతాహమిమా స్తిస్రో దేవతాః, అనేన జీవే నాత్మనానుప్రవిశ్య నామరూపేవ్యా కరవాణి"= జీవశరీరకుఁడనైన నేను పృథివ్యప్తేజస్సులను ముగ్గురు దేవతలనుగూర్చి ప్రవేశించి నామరూపములను వివరించెదను. "తత్సృష్ట్వా తదేవాను ప్రావిశత్, తదనుప్రవిశ్య సచ్చత్యచ్చాభవత్ విజ్ఞానం చావిజ్ఞానంచ

సత్యంచానృతంచ సత్యమభవత్” = ఆ ప్రపంచమును సృజించి యా ప్రపంచములోఁ బ్రవేశించెను. దానిలోఁ బ్రవేశించి ‘సత్త’ని చెప్పఁబడు పృథివ్యాది భూతత్రయము, ‘త్యత్’ అని చెప్పఁదగిన యాకాశాది భూతద్వయము, ‘విజ్ఞానమ’నఁదగిన చిత్ప్రపంచము, ‘అవిజ్ఞాన మ’నఁదగిన జడ ప్రపంచము, ‘సత్యమ’నఁదగిన నిత్యవస్తుజాతము, ‘అనృతమ’నఁదగిన యనిత్యవస్తుజాతము, ఇవియన్నియు, సత్స్వరూపుఁడగు పరమాత్మయే యాయెను. ఇచ్చట ‘అనేన జీవేన’అను వాక్యము జీవునకు బ్రహ్మాత్మత్వమును దెలుపుచున్నది. ఈ బ్రహ్మాత్మత్వము శరీరశరీరిభావనిబంధనమని “తదనుప్రవిశ్యసచ్చత్యచ్చాభవత్ విజ్ఞానంచావిజ్ఞానంచ” ఇత్యాది వాక్యములు విశదీకరించుచున్నవి. ఇచ్చటఁ జెప్పిన నామరూపవ్యాకరణమునే “తద్ధేదం తర్హ్యవ్యాకృత మాసీత్తన్నామ రూపాభ్యాం వ్యాక్రియత” అను శ్రుతియును బ్రతిపాదించెను. సృష్టికిఁ బూర్వ మీ ప్రపంచముయొక్క నామరూపములు వ్యక్తములు గాకుండెను. సృష్టి తర్వాత నామరూపములతో నా ప్రపంచము వ్యక్తమయ్యెను. కావునఁ గార్యావస్థనొందినవాఁడును, గారణావస్థను బొందినవాఁడును, స్థూల సూక్ష్మ చిదచిద్వస్తు శరీరుఁడైన పరమాత్మయే యయినందునఁ, గార్యకారణములకు భేదము లేకపోయినది. అందువలననే కారణవిజ్ఞానముచేఁ గార్యవిజ్ఞానము కలుగుచున్నది. ఈ యర్థమును బ్రతిపాదించునట్టి శ్రుతియును యుక్తియు క్తమైయున్నది. “అహమిమాస్తిస్రో దేవతాః” అను శ్రుతియందు ‘తిస్రో దేవతాః’ అను శబ్దములచే సమస్తమయిన అచిద్వస్తువును నిర్దేశించి దానియందుఁ బరబ్రహ్మాత్మగాఁగల జీవుని యొక్క అను ప్రవేశముచేత నామరూప వ్యాకరణమును జెప్పినందున వాచకశబ్దములన్నియు అచిద్విశిష్టుఁడైన జీవునితో విశిష్టుఁడై యున్న పరమాత్మకే వాచకములు కావున, కారణావస్థుఁడగు పరమాత్మయొక్క వాచకములగు ‘సదాత్మాది’ శబ్దములకు, కార్యవాచకములగు ‘ఇదంత్వమాది’ శబ్దములతోఁ జేయఁబడిన సామానాధికరణ్యము (అనఁగ ‘సదేవసోమ్యేదం’‘తత్త్వమసి’ ఇత్యాదిసామానాధికరణ్యము) ముఖ్యమేగాన లాక్షణికముకాదు. కార్యము, కారణము,

స్థూల సూక్ష్మ చిదచిద్విశిష్టమైన బ్రహ్మమే యయినందున, బ్రపంచ మునకు బ్రహ్మము, ఉపాదాన కారణమయినను, నా బ్రహ్మము సూక్ష్మచిదచిద్వస్తు విశిష్టమయి యున్నందున, చిదచిద్బ్రహ్మసంఘాతము ఉపాదానముగాని, కేవలబ్రహ్మము ఉపాదానము కాదు. దాని వలననే చిదచిత్తులకును, బ్రహ్మమునకును, స్వభావసాంకర్యము సంభవింపదు. ఏలాగునన:— తెలుపునూలు, ఎఱుపునూలు, నలుపునూలు, వీనియొక్క సముదాయము చిత్రవస్త్రమునకు నుపాదానకారణమయినను, తెలుపులోనగు మూఁడురంగులు కార్యావస్థయందును నా యా తంతువు (దారము) లందే యుండును గాని సాంకర్యమును బొందవు గదా. ఆ లాగుననే, చిదచిదీశ్వరసంఘాతము జగత్తునకు నుపాదాన కారణమయినను, కార్యదశయందుఁ గూడ భోక్తృత్వభోగ్యత్వనియంతృత్వములు వ్యవస్థితములయి యుండును గాని సంకీర్ణములు కానేరవు. దారములు వేఱువేఱుగ నుండుటకు యోగ్యములయి యొకానొక సమయమందు నొక పురుషుని యొక్క యిచ్ఛచేత సంఘాతభావమును బొంది కారణత్వమును, కార్యత్వమును, బొందుచుండును. చిదచిత్తులు సర్వావస్థలయందును పరమాత్మకు శరీరముగానే యుండి యతనికంటె వేఱుగ నుండనందున చిదచిచ్ఛరీరకుఁడైన పరమాత్మ సర్వావస్థలలోను సర్వశబ్దవాచ్యుఁడై యుండును. ఇదియే దృష్టాంత దార్ష్టాంతికములకుఁ గల విశేషము. స్వభావ భేదము, స్వభావాసాంకర్యమును, రెండింటను తుల్యములే. ఇట్లుండ, పరబ్రహ్మము కార్యవర్గమందుఁ బ్రవేశించినను, దన స్వరూపము మారనందున, శ్రుతులయందుఁ జెప్పఁబడిన నిర్వికారత్వము యుక్తముగనున్నది. స్థూలదశనుబొంది నామరూపవిభాగము గలిగియున్న చిదచిద్వస్తువులకు నాత్మగానున్నందున, పరమాత్మకుఁ గార్యత్వముగూడ నుచితముగానే యున్నది. కార్యత్వమనఁగ నవస్థాంతరమును బొందుటయే గదా. బ్రహ్మము నిర్వికారమని చెప్పు శ్రుతులకుఁ బ్రకృతికివలె స్వరూపము మారదనియే తాత్పర్యము. బ్రహ్మమునకుఁ గార్యత్వము నుపపాదించు "సచ్చత్యచ్చాభవది"త్యాది శ్రుతులకుఁ గార్యదశనుబొందిన చిదచిత్తు

లను నియమించుట యను నన్యథాభావమును బోధించుటయందుఁ దాత్పర్యము. కారణదశను బొందిన చిదచిత్తులను నియమించుటయే కార్యదశను బొందియున్న చిదచిత్తులను నియమించుట కాదుగదా. కార్యకారణ దశాపన్న చిదచిన్నియమనముల ద్వారక బ్రహ్మసంబంధులు. స్వరూపాన్యథాపత్తి జ్ఞానసంకోచాది వికారములు చిదచిద్ద్వారా బ్రహ్మసంబంధులు. అది యేలాగన వినుఁడు :— "దర్శపూర్ణమాసాభ్యాంయజేత" అనువాక్యము దగ్గఱఁ జెప్పఁబడిన వ్రీహిప్రయాజ ప్రోక్షణాదులు పరమాపూర్వ (ఫల) శేషములయినను, ప్రయాజవ్రీహ్యాదులు అద్వారకముగఁ బరమాపూర్వశేషములనియు, ప్రోక్షణాదులు వ్రీహ్యాదిద్వారా తచ్ఛేషములనియు, తాంత్రికు లంగీకరించియున్నారు. అట్లే "బహుస్యాం" అను వాక్యసన్నిధియందు బ్రహ్మసంబంధులుగఁ దెలియఁబడుచున్న యవస్థలలో జ్ఞానసంకోచాదులు సద్వారక బ్రహ్మసంబంధులని యంగీకరించుట విరుద్ధముకాదు.

నిర్గుణశ్రుతులు హేయగుణసంబంధము బ్రహ్మమునకు లేదని ప్రతిపాదింపుచున్నవి. "అపహతపాప్మావిరజ" ఇత్యాది శ్రుతి, 'అపహతపాప్మాది' శబ్దములచేత బ్రహ్మకు హేయగుణముల నిషేధించి, "సత్యకామ స్సత్యసంకల్ప" శబ్దములచే, (శుభ) కళ్యాణగుణములను విధించుచున్నది. కాన నిఁక యే శ్రుతియందైనను సామాన్యముగా గుణనిషేధము చేయఁబడినచో నా శ్రుతి హేయగుణవిషయమని నిశ్చయింపఁదగి యున్నది. బ్రహ్మము జ్ఞానస్వరూపమని చెప్పునట్టి "ప్రజ్ఞానఘనలవ" ఇత్యాది శ్రుతియును, సర్వజ్ఞుఁడును, సర్వశక్తిసంపన్నుఁడు, నఖలహేయసంబంధశూన్యుఁడును, సమస్తకల్యాణగుణనిలయుఁడును, నగు పరమాత్మయొక్క స్వరూపము జ్ఞానముచేతనే నిరూపింపఁదగియున్నదని స్వయంప్రకాశమయినందున జ్ఞానస్వరూపమనియంగీకరించుట యుపపన్నము. "తద్గుణసారత్వాత్" అను సూత్రమందు, ఆత్మ జ్ఞానస్వరూపుఁడనియు, జ్ఞానగుణకుఁడనియు నుపపాదింపఁబడియున్నది. పరమాత్మ జ్ఞానస్వరూపుఁడు, జ్ఞానగుణకుఁడు (అనఁగాజ్ఞాత), అనియు బోధించు శ్రుతులేవియన "యస్సః

ర్వజ్ఞసర్వవిత్"=ఎవఁడు సర్వవస్తువుల స్వరూపము నెఱిగినవాఁడో సర్వ వస్తువుల స్వభావమును దెలిసినవాఁడే. "పరాస్యశక్తిర్వివిధైవ శ్రూయతే స్వాభావికీజ్ఞాన బలక్రియాచ"=ఈపరమాత్మయొక్క శక్తి సర్వాధికమని యు, ననేకవిధములు కలదనియు, వినఁబడుచున్నది. ఇతనికి జ్ఞానబల క్రియలు స్వభావసిద్ధములు. "విజ్ఞాతారమరే కేన విజానీయాత్"=విజ్ఞా త (విశేషముల నరయువానిని) యగు పరమాత్మను దేనివలనఁ దెలి యనగు? ఇట్టి వేదవాక్యములు పరమాత్మయొక్క జ్ఞాతృత్వమును దె లియఁజేయును. 'సత్యంజ్ఞానం' లోనగు శ్రుతులచే జ్ఞానైకనిరూపణీయుఁ డగుటవలనను, స్వప్రకాశుఁడగుటవలనను, పరమాత్మ జ్ఞానస్వరూపుఁ డని తేలుచున్నది. జ్ఞాతృత్వమనఁగా జ్ఞానాశ్రయత్వము. జ్ఞానమునకు జ్ఞానాశ్రయత్వమును జెప్పినచో 'ఆత్మాశ్రయదోషము' రాదాయని శంకింపఁదగదు. ప్రకాశస్వరూపుఁడైన సూర్యునకుఁ బ్రకాశాశ్రయత్వ మువలె జ్ఞానస్వరూపుఁడగు పరమాత్మకు జ్ఞానాశ్రయత్వము విరుద్ధము కాదు. స్వరూపప్రకాశము, ధర్మభూతప్రకాశమును, నేకజాతీయము లయినను, భిన్నద్రవ్యములయినట్లు, స్వరూపభూతజ్ఞానము, ధర్మభూత జ్ఞానమును, నేకజాతీయములయినను, భిన్నద్రవ్యములయినందున, 'ఆత్మా శ్రయదోషము' రానేరదు. ధర్మభూతజ్ఞానము, భిన్నద్రవ్యమైనచో దా నికి గుణత్వవ్యవహార మెట్లు సిద్ధించినదనిన, నది నిత్య తదాశ్రయమై నందున, సిద్ధించినదని తెలియవలయు. "సోఽకామయత బహుస్యాం తదైక్షత బహుస్యాంత న్నామరూపాభ్యాంవ్యా క్రియత" ఇత్యాదిశ్రు తులు పరమాత్మయే తన సంకల్పమువలన విచిత్ర చరాచరరూపముగ నున్నాఁడని బోధించుచున్నవి. దానివలననే బ్రహ్మము అంతర్యామిగ లేనివస్తువులయొక్క నానాత్వము పరమార్థమని కొన్నిశ్రుతులు నిషే ధించుచున్నవి. "మృత్యోస్సమృత్యుమాప్నోతి యఇహనానేవపశ్య తి"=ఎవఁడీలోకమునందు నేవస్తువైనను బ్రహ్మాత్మకముకంటె భిన్నమైన దానిని—అనఁగా, అబ్రహ్మాత్మకముగఁజూచునో,—వాఁడు మృత్యువులో నుండి మృత్యువును—అనఁగా నిత్యసంసారిత్వమును బొందును. "నేహ నా నాస్తికించన"=ఈప్రపంచమందబ్రహ్మాత్మకమైనది కొంచెమైనను

లేదు. "యత్రహి ద్వైతమివభవతి తదితర ఇతరం పశ్యతి" ఎప్పు డబ్రహ్మాత్మకమైన వస్తువుండునో యప్పుఁ డితరుఁడితరమును జూచును. "యత్రత్వస్య సర్వ మాత్మైవాభూత్ తత్కేన కంపశ్యేత్" = ఎప్పుఁడితనికి సర్వవస్తువు బ్రహ్మాత్మకముగా నేర్పడునో యప్పుఁ డెవఁడు దేని చేత దేనిని జూచును? ఈ శ్రుతులు స్థూలసూక్ష్మ చిదచిద్విశిష్టబ్రహ్మాత్మక కార్యకారణభేదమును నిషేధించుచున్నవి. ఇంతియకాని 'బహుస్యాం' ఇత్యాది శ్రుతిసిద్ధమయి, స్వసంకల్పనిర్మితమై, నానావిధనామరూపప్రాప్తిరూపమయిన భేదము నిషేధింపఁబడినది కాదు. ఈ యర్థము "యత్రత్వస్యసర్వమాత్మైవాభూత్" ఇత్యాది వాక్యములయొక్క యర్థవిచారసమయమందుఁ బ్రపంచమంతయు బ్రహ్మకార్యమైనందుచే బ్రహ్మము అంతర్యామిగా కలదై నందున తాద్రూప్యముచే నేకమయి నందున, తద్విరుద్ధమగు భేదము మాత్రము నిషేధింపఁ బడుచున్నది. సామాన్యనిషేధ మువిహిత విశేషవ్యతిరిక్త విషయముగదా యని ప్రతిపాదించియుంటిని. ఈవిధముగ శ్రుత్యర్థమును నిర్వహించినచో చిదచిదీశ్వరులకు స్వరూపస్వభావభేదముల నుపపాదించు శ్రుతులకుఁ గార్యకారణభావమును, కార్యకారణముల కేకత్వమును, జెప్పు శ్రుతులకును, విరోధము లేకపోవును. ఈ యవిరోధము చిదచిత్తులకు సర్వదా బ్రహ్మ శరీరత్వమును, బ్రహ్మమునకుఁ జిద చిదాత్మత్వమును, బ్రహ్మ శరీరభూతములగు చిదచిత్తులకుఁ గారణదశయందు నామరూపవిభాగాయోగ్యమగు సూక్ష్మదశాపత్తిని,కార్యదశయందు నామరూపవిభాగయోగ్యమగు స్థూలదశాపత్తిని, బోధించునట్టి శ్రుతులచేతనే తెలియఁబడుచున్నది. కావున మిథ్యాఽజ్ఞానముచేత బ్రహ్మమునకు భేదము సంభవించినదను శ్రీశంకరమతము, సత్యోపాధిచేత బ్రహ్మమునకు భేదముసంభవించినదను శ్రీభాస్కరమతమును, దుష్టన్యాయమూలములై శ్రుతివిరుద్ధములయి యున్నందున ననాదరణీయములని శ్రీ రామానుజాభిప్రాయము.

చిదచిదీశ్వరులు భిన్నస్వభావములవారుగ నా యాశ్రుతులచేఁ బ్రతిపాదింపఁబడి యున్నారు. ఇదిగాక శరీరాత్మభావముచేతను

ప్రకారప్రకారి భావముచేతను, అనఁగా చిదచిత్తులు శరీరమనియు, ఈశ్వరుఁ డాత్మయనియు, చిదచిత్తులు విశేషణములనియు, ఈశ్వరుఁడు విశేష్యమనియు, అంతర్యామి బ్రాహ్మణాదిశ్రుతులచేఁ బ్రతిపాదింపఁబడియున్నారు. ఇట్టి చిదచిదీశ్వరులకు "సదేవ సోమ్యేద" మిత్యాది శ్రుత్యంతరము కార్యకారణభావమును, కార్యకారణమునకైక్యమును, ప్రతిపాదించుట విరుద్ధముకాదు. అది యెట్లనిన: —ఆగ్నేయయాగము, అగ్నీషోమీయయాగము, ఉపాంశుయాజయాగము, ఐంద్రయాగములు రెండు, ఇంద్రాగ్నయాగము, అను నాఱు యాగములు, ఉత్పత్తివాక్యములచేతఁ బ్రత్యేకముగఁ బ్రతిపాదింపఁబడినవి. అనఁగా:—"యదాఽగ్నేయోష్టాకపాలోఽ మావాస్యాయాంచ పౌర్ణమాస్యాంచాచ్యుతో భవతి" = అగ్ని దేవతనుగాఁ గలిగి, అష్టాకపాలసంస్కృతిపురోడాశము ద్రవ్యముగాఁగలిగియున్న యాగము, అమావాస్యయందును, చెదరకయుండును. ఇత్యాది ప్రథమ ప్రతీతి జనకవాక్యములచేత నుపపాదింపఁబడి యున్నవి. ఈ యాఱు యాగములు "య ఏవం విద్వాన్ పౌర్ణమాసీం యజతే, య ఏవం విద్వానమావాస్యాం యజతే" అను వాక్యములచే సముదాయద్వయముగా బోధింపఁబడినవి. అనఁగా, ఆగ్నేయోపాంశుయాజ అగ్నీషోమీయములు, పౌర్ణమాసీ శబ్దముచేత నొకటిగాను, ఆగ్నేయము, ఐంద్రదధియాగము, ఐంద్రపయోయాగము, అమావాస్యాశబ్దముచేత నొకటిగాను, బోధింపఁబడినవి. తరువాత 'దర్శపూర్ణమాసాభ్యాంయజేత' అను వాక్యము పూర్వోక్తసముదాయద్వయమును, స్వర్గసాధనత్వ రూపముచే నొకటిగాఁజేసి, దానినింగర్తవ్యముగా విధించుచున్నది. అలాగుననే 'క్షరం ప్రధానమి'త్యాదివాక్యములచే, చిద చిదీశ్వరులను బరస్పర విభిన్న స్వభావములు కలవారినిఁగాఁ బ్రతిపాదించి, "యస్య పృథివీశరీరం యస్యాత్మాశరీరం" ఇత్యాది వాక్యములచేత సర్వావస్థలయందు చిదచిత్తులు పరమాత్మ శరీరములనియు, వానికి పరమాత్మ ఆత్మయనియుఁ, బ్రతిపాదించి, ఆత్మభూతుఁడైన పరమాత్మను బోధించు 'సదాత్మ బ్రహ్మ' శబ్దములచేతఁ గారణదశను బొందినవాఁడు,=పరమాత్మ యొక్కఁడే యనియు,

ప్రత్యేకముగఁ దెలియఁబడిన చిదచిదీశ్వరులగు ముగ్గురను "సదేవ సోమ్యేదం" "సర్వంఖల్విదం" ఇత్యాది వాక్యములు చెప్పుచున్నవి. పరమాత్మవాచకశబ్దము చిదచిచ్ఛరీరకుఁడైన పరమాత్మను జెప్పుటయందు విరోధము కనఁబడదు. ఏలాగుననః...మనుష్యపిండము శరీరముగాఁగల జీవాత్మ "అయమాత్మా సుఖీ" = (ఈ యాత్మ సుఖవంతుఁడు), ఇత్యాది వాక్యములయం దాత్మశబ్దముచేఁ జెప్పఁబడినట్లు భావింపవలయు.

3 —* మోక్షస్వరూపము, తత్ప్రాప్తి *—

సకలజగత్కర్తయును, సర్వజ్ఞుఁడును, సర్వశక్తిసంపన్నుఁడును, సమస్తకల్యాణగుణాకరుఁడును, నిఖిలహేయప్రతిభటుఁడును, నైన పరమాత్మయొక్క ప్రసాదముచేతజీవుఁడు నివృత్తాశేషబంధనుఁడై అర్చిరాదిమార్గముగుండ, అప్రాకృతనిత్యవిభూతిని బొంది, ఆవిర్భూత గుణాష్టక స్వరూపుఁడయి; నిరంతర భగవదనుభవ పరీవాహ నిమగ్నుఁడై పునరావృత్తి లేకయుండుటయే మోక్షము.

౪ — మోక్షమునకు ముఖ్యసాధనము భగవత్ప్రసాదము. —దానికి నుపాయము భక్తి. జ్ఞానధ్యానోపాసనభక్తులు పర్యాయపదములు

ఆమోక్షమునకు ముఖ్యసాధనము భగవత్ప్రసాదము (అనుగ్రహము). ఆప్రసాదమునకు సాధనము 'జ్ఞాన, ధ్యాన, వేదన, ఉపాసనా'ది శబ్దవాచ్యమైన భక్తియోగము. ఇది దహరశాండిల్యాది భేదముచే ముప్పదిరెండు విధములని వేదాంతము లుద్ఘోషించుచున్నవి. ఇంతకంటె వేఱు మోక్షసాధనము లేదని "తమేవం విద్వానమృత ఇహ భవతి నాన్యః పంథావిద్యతేఽయనాయ" ఇత్యాదిశ్రుతులు మొఱపెట్టుచున్నవి ఈ భక్తియోగమునకు యజ్ఞదానాది నిత్యనైమిత్తికకర్మములు, శమదమాదులు, అంగములు, అనఁగ నుపకారకములు. వివేకవిమోకాదులు, యమాదులు, కర్మములచేఁ జేయఁబడు నుపకారము భక్తియోగమునకు ఫలదశయందు లేదు, ఉత్పత్తిదశయందు మాత్రము కలదు. కనుకనే "జ్ఞానాదేవతుకైవల్య" మిత్యాది వాక్యములకు విరోధము లేదు.

౫ — భక్త్యంగములేడు.

ఈ భక్తియోగమునుఁ బ్రకటనముఁ జేయు సాధనము లేడు కలవు. అవి యేవియన :— వివేకము, విమోకము, అభ్యాసము, క్రియ, కల్యాణము, అనవసాదము, అనుద్ధర్షము.

(౧) వీనిలో జాతిదుష్టనిమిత్తదుష్టాశ్రయదుష్టములయిన ద్రవ్యములను బరిత్యజించి శుద్ధద్రవ్యములను భుజించి, శరీరమును బరిశుద్ధముగఁ జేసికొనుట వివేకమనఁబడు. ఇందులకుఁ బ్రమాణము:—"ఆహారశుద్ధేస్సత్వశుద్ధిః, సత్వశుద్ధౌధృవాస్మృతిః" అను ఛాందోగ్యశ్రుతి= ఆహారము శుద్ధముగనుండినచో, చిత్తశుద్ధి కలుగును; చిత్తము శుద్ధమైనచో 'ధృవానుస్మృతి' యను భక్తియోగము సిద్ధించునని శ్రుత్యర్థము. కలంజగృంజనలశునా (ముల్లంగి, ఉల్లిపాయ లోనగునవి) ది ద్రవ్యములు జాతిదుష్టములు. కేశకీటాది మిశ్రమమయిన యన్నము నిమిత్తదుష్టము. చోరపతితాది దత్తద్రవ్యము లాశ్రయదుష్టములు. ఈ మూఁటిని విడువవలయు.

(౨) శబ్దాదివిషయానుభవమందభినివేశము లేకుండుట విమోకము. ఇందులకుఁ బ్రమాణము "శాంతఉపాసీత" ఇత్యాదిశ్రుతి=శమించిన విషయేచ్ఛకలవాఁడై యుపాసింపవలయునని దానికర్థము.

(3) ఉపాస్య (ఉపాసనము చేయఁదగిన దేవత) స్వరూపమునుపాసనకాలమందేగాక యితరకాలమందునుగూడ మాటిమాటికిఁ జింతించుట, అభ్యాసము. ఇందులకు 'సదాతద్భావభావితః' అను భగవద్వచనము ప్రమాణము. సర్వకాలములందు, నుపాస్యస్వరూపానుసంధానముచే సంస్కరింపఁబడినవాఁడై యుండవలయునని దాని తాత్పర్యము.

(౪) యథాశక్తితోఁ పంచమహాయజ్ఞాదులను జేయుట క్రియయనఁబడును. ఇందులకుఁ బ్రమాణము "క్రియావానేష బ్రహ్మవిదాంవరిష్ఠః"; "తమేతం వేదానువచనేన బ్రాహ్మణావివిదిషంతి యజ్ఞేన

దానేన తపసాఽనాశకేన" లోనగు శ్రుతులు = పంచమహాయజ్ఞాది నిత్యక్రియలుకలవాఁడు బ్రహ్మవేత్తలలో నుత్తముఁడు; ఈ పరమాత్మను బ్రాహ్మణులు వేదాధ్యయనముచేతను, యజ్ఞముచేతను, దానముచేతను, తపస్సుచేతను, అనశనవ్రతముచేతను, తెలిసికొనుచున్నారని శ్రుత్యర్థము.

(౫) సత్యార్జవదయాదానాహింసానభిధ్యలు, కల్యాణము. యదార్థవచనము సత్యము. మనోవాక్కాయములచే నకుటిలముగఁ బ్రవర్తించుట ఆర్జవము - దుఃఖవంతులయొక్క దుఃఖమునుఁజూచి సహింపలేకపోవుట దయ - దీనానాధజనులకు యథాశక్తితో నన్నవస్త్రాదుల నిచ్చుట దానము. భూతములకు దుఃఖమునుగలుగజేయకుండుట అహింస. వ్యర్థముగ ధనాదులను జింతింపకయుండుట అనభిధ్య. ఇందులకుఁ బ్రమాణము :— "సత్యేన లభ్యస్తేషా మే వైష విరజో బ్రహ్మలోక" ఇత్యాది శ్రుతులు= రజోగుణశూన్యమయిన బ్రహ్మలోకము వారికే సత్యముచేతను లభ్యమయినది యని దాని కర్థము.

(౬) ప్రతికూల దేశకాలాదిసంప్రాప్తిచేతఁగాని, పుత్రమరణాదివలనఁగాని, మనస్సునకు దైన్యముకలుగుట అవసాదము. అదిలేకయుండుట అనవసాదము. ఇందులకుఁ బ్రమాణము:—"నాయమాత్మా బలహీనే నలభ్యః" అను శ్రుతి= ఈ పరమాత్మ మనోబలము లేనివానిచే లభ్యుఁడు గాఁడని యర్థము.

(౭) అనుకూల దేశకాలాదిసంప్రాప్తిచేతనుగాని పుత్రజన్మాది లాభముచేతనుగాని మనస్సునకుఁ గలుగు నధికహర్షము, ఉద్ధర్షము. అది లేకయుండుట అనుద్ధర్షము. అతిసంతోషము నుపాసనకు విరోధి యని భావము. దీనికిఁ బ్రమాణము:— "శాంతో దాంత" ఇత్యాది శ్రుతి= అంతరింద్రియ బాహ్యేంద్రియ నిగ్రహాదులు గలిగి యుండవలయునని యర్థము. వీని విశేషములను మత్కృత శ్రీమద్భాగవతసారమునఁ జూడనగు.

౬-శ్రవణమననములు నిదిధ్యాసమున కంగములు. భక్తిస్వరూపాదులు.

ఈ సాధన సప్తకానుగ్రహీతమయిన దహరశాండిల్యాది భిన్నోపాసనాది శబ్దవాచ్య తైలధారావదవిచ్ఛిన్న స్మృతి సంతానాత్మక ప్రత్యక్ష సమానాకార భక్తి యోగము మోక్షసాధనము. భక్తియోగము ప్రత్యక్షసమానాకారమని "ఆత్మావా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః" అను శ్రుతి బోధించుచున్నది. ఇచ్చట వేదార్థవిచార తచ్చింతనములను శ్రవణమననములు రాగప్రాప్తములయినందున విధియోగ్యములు కావు. వేదాధ్యయనమును జేసిన వానికిఁ దదర్థజ్ఞాన కుతూహలము స్వయముగానే జన్మించును గద. నిదిధ్యాస మప్రాప్తమయినందున నిచ్చట విధేయము. అది 'ద్రష్టవ్యః' అను పదముచేత దర్శనసమానాకారమని తెలియఁబడుచున్నది. కావున దర్శనసమానాకార విశిష్టనిదిధ్యాసము "ఆత్మావా అరే ద్రష్టవ్యః" అను వాక్యముచే విధింపఁబడుచున్నది. ఇట్టి నిదిధ్యాసము, ఉపాస్యవిషయ ప్రీతిరూపమయినందున భక్తియనఁబడును. పూజ్యులయందుఁ గలయనురాగమే భక్తి. అదియే నిదిధ్యాసముయొక్క ప్రీతిరూపత్వము. "నాయమాత్మా ప్రవచనే నలభ్యో నమేధయా నబహునా శ్రుతేన. యమే వైషవృణుతే తే నలభ్య స్తస్యైష ఆత్మావివృణుతే తనూంస్వా" మిత్యాది శ్రుతి విశదీకరించుచున్నది. ఈ పరమాత్మ కేవల శ్రవణముచేతను, కేవల మననముచేతను, కేవల నిదిధ్యాసముచేతను, లభ్యుఁడుకాఁడు. ఎవని నీపరమాత్మ వరించునో వానికే లభ్యుఁడు. వానికే తన స్వరూపమును సాక్షాత్కరింపఁజేయునని యీ శ్రుత్యర్థము. ఇచ్చటఁ బరమాత్మచేత వరణీయు (వరింపఁదగినవాఁడు)ఁడ త్యర్థప్రియుఁడుగా నుండవలె. అత్యంతప్రియుఁడే లోకములో వరణీయుఁడు. ఎవనికిఁ బరమాత్మ యత్యంత ప్రియుఁడై యుండునో వాఁడె పరమాత్మకు నత్యర్థ ప్రియుఁడై యుండును. ఈ యర్థము "ప్రియోహి జ్ఞానినో ఽత్యర్థ మహం సచమమప్రియః" అను భగవద్గీతావచనముచే విస్పష్టమయి యున్నది కావున సాక్షాత్కారరూపమయిన స్మృతి యెవనికి నత్యర్థప్రియమయి యుండునో వాఁడే పర

మాత్మచే వరణీయుఁడై యుండును. దీనిచే భగవద్విషయప్రీతి రూప స్మృతిసంతానము భక్తి యని నిశ్చయింపఁ దగును. శ్రవణమనననిది ధ్యాసభక్తిజ్ఞానప్రపత్తివిశేషములను మత్కృతబ్రహ్మసూత్రసారమునఁ జూడనగు.

—* ౭ నారాయణుఁడే పరబ్రహ్మము *—

ఇచ్చటఁ బరమాత్మయని చెప్పఁబడినది నారాయణుఁడు. అతఁడే జగత్కారణము. జగత్కారణవాది వాక్యములలో "సద్బ్రహ్మాత్మా" ది శబ్దములు చిదచిద్వస్తుజీవేశ్వర సాధారణములయినందున ఛాగపశున్యాయము ననుసరించి విశేషమునందుఁ బర్యవసాన మవశ్యకము గాన "ఏకోహ వై నారాయణ ఆసీత్" ఇత్యాదివాక్యసిద్ధమయిన నారాయణుఁడే జగత్కారణమని సిద్ధించుచున్నది. నారాయణుని యొక్క ధ్యేయత్వము, పరమకారణత్వాదివిశేషములు, నారాయణానువాకమందు స్పష్టములు. ఈ నారాయణుఁడు ముక్తప్రాప్యమగునపుడు దివ్యమంగళవిశిష్టుఁడై అనంత గరుడ విష్వక్సేనాది నిత్యసూరిపరివృతుఁడై లక్ష్మీసహితుఁడై యుండును. దీనికి "ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్, తేహినాకం మహిమాన స్సంచరంతే, యత్రపూర్వే సాధ్యాస్సంతి దేవాః తద్విష్ణోః పరమం పదం, సదా పశ్యంతి సూరయః, హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌ" ఇత్యాది శ్రుతులును, పర్యంకవిద్యావాక్యములును, ప్రమాణములు.

—* ౮ శ్రీ రామానుజాచార్య చరిత్ర సంగ్రహము *—

ఇది శ్రీ వైష్ణవ విశిష్టాద్వైతమతము. దీనిని బ్రవర్తింపఁజేసిన వారు శ్రీ రామానుజాచార్యులు. వారు వడమజాతి ద్రావిడబ్రాహ్మణులు, హారితసగోత్రులు. వీరి గృహనామధేయము, ఆసూరివారు. వీరి తండ్రిగారు కేశవసోమయాజులు, తల్లి కాంతిమతి. వీరు కలియుగమున ౪౧వ శతాబ్దమున క్రోధిసంవత్సరమందు మేషమాస శుక్లపంచమి ఆర్ద్రానక్షత్రమున, కాంచీమండలములోని భూతపురియను శ్రీ పెరుంబుత్తూరు (తిరువల్లూరునకు సమీపమునఁ) నందు జన్మించి తండ్రిగారియొద్దనే వేదవేదాంగములను జదివి గృహస్థాశ్రమము నంగీకరించి తరువాత

కాంచీనగరములో నుండు యాదవప్రకాశులను నేకదండి సన్యాసుల యొద్ద శాస్త్రాధ్యయనమును జేయుచుండిరి. కొంతకాలమునకు యాదవ ప్రకాశులకును వీరికిని శ్రుత్యర్థనిర్ణయమందు విప్రతిపత్తి (విరుద్ధాభిప్రాయము) కలిగినందున యాదవప్రకాశుల యొద్ద శాస్త్రాధ్యయనము మాని స్వయముగ శాస్త్రచింతనముఁ జేయుచు విష్ణుభక్తి పరులయి యుండి శ్రీరంగములో నున్న యామునాచార్యులను త్రిదండిసన్యాసి శ్రీవైష్ణవసిద్ధాంతప్రవర్తకులయి యున్నారని విని తద్దర్శనార్థము వెళ్లిరి. వీ రిచ్చటికిఁ జేరుటకు ముందే యామునాచార్యులు పరలోకగతులయినందున వారి దర్శనము లభింపక తిరిగి కంచికి వచ్చి పూర్వమువలె నక్కడఁ గొన్నినాళ్లుండి యామునాచార్య శిష్యులచే నాహూతులయి శ్రీరంగమునకుఁ దిరిగి పోయి యామునాచార్యకృత గ్రంథముల నవలోకించి తచ్ఛిష్యభావమునొందఁగోరి యామునాచార్య శిష్యులలో నగ్రేసరులగు పూర్ణాచార్యులనొద్ద తప్తచక్రాంకనాది వైష్ణవ సంస్కారముల నొంది యత్యాశ్రమమును స్వీకరించి శ్రీరంగనాథ కైంకర్య నిరతులయి వైష్ణవసిద్ధాంతమును బ్రవర్తింపఁజేయుచు, నేడు గ్రంథములను రచించిరి. శ్రీభాష్యము, వేదాంతదీపము, వేదాంతసారములను బ్రహ్మసూత్రవ్యాఖ్యానములు, వేదార్థసంగ్రహమను ప్రకరణగ్రంథము, భగవద్గీతాభాష్యము, గద్యత్రయమను భగవత్స్తుతి, నిత్యక్రమమను భగవదారాధనపద్ధతి, అనునవి సప్తప్రబంధములు. వీరు తమమతమును వ్యాపింపఁజేసి ౧౨౦ సంవత్సరములు జీవించి పరమపదమును బొందిరి.

—* ౯ శ్రీరామానుజ సంప్రదాయప్రవర్తకులు *—

వారి కనేక శిష్యు లేర్పడిరి. వారిలో సంప్రదాయప్రవర్తకులయి ప్రసిద్ధినొందిన శిష్యు లిద్దఱు:— యెంబారను ద్రావిడనామము గల గోవిందాచార్యులొకరు, కిడాంబి యాచ్చానను ద్రావిడనామముగల వేదాంతోదయనాచార్యులు మఱియొకరు. గోవిందాచార్య సంప్రదాయనిష్ఠులాళ్వార్లచే రచియింపఁబడిన ద్రావిడప్రబంధము

లను, అపౌరుషేయనిత్యనిర్దోష వేదములవంటివనియు, వేదతుల్యప్రమాణములనియు, నమ్మి యా ద్రవిడప్రబంధములయొక్క పఠనపాఠములనే తఱచుగ ననుష్ఠించుచున్నందున ద్రావిడాచార్యులనియు, తెంగ (గ) ల (దక్షిణదేశకళలను—ద్రావిడప్రబంధములను—దెలిసిన) వారనియు, ప్రసిద్ధినొందియున్నారు. వేదాంతోదయనాచార్యులు వారి సంప్రదాయనిష్ఠులు వేదములను ప్రధానములుగ విశ్వసించి ద్రావిడప్రబంధములను వేదములవంటివని నమ్మినను, అవి వేదానుసారి ప్రమాణములని తలంచి, వేదముయొక్క పఠనపాఠములను దఱచుగ నాచరించుటం జేసి సంస్కృతాచార్యులనియు, వడక (గ) ల (ఉత్తరదేశకళలను—వేదశాస్త్రములను—దెలిసిన) వారనియు, ప్రసిద్ధిం జెందియున్నారు. గోవిందాచార్యశిష్యులు భట్టపరాశరులు. వీరు తత్త్వరత్నాకరమను శారక ప్రకరణమును, సహస్రనామభాష్యమును, అష్టశ్లోకి, శ్రీరంగరాజస్తవము, శ్రీగుణరత్నకోశము, అను గ్రంథములను నిర్మించిరి. వీరి పరపరలో నుత్తరవీధి భట్టాచార్యులనువారు ద్రావిడప్రబంధములలో నొక్కటి యగు 'తిరువాయిమొళికి' షట్త్రింశత్సాహస్రిక యన 36000 వేల గ్రంథరూపమగువ్యాఖ్యను ద్రావిడభాషలో రచియించిరి వీరి కుమారులును శిష్యులును నగు పిళ్ళెలోకాచార్యులు, 'ముముక్షుప్పడి', శ్రీవచనభూషణము, లోనగు నష్టాదశరహస్యములను జేసి కొన్ని విశేషార్థములను విశదీకరించిరి. వీరికాలమందు ద్రావిడాచార్యసిద్ధాంతము వృద్ధినొందినది.

—* ౧౦ ప్రపత్తి లేక శరణాగతి *—

భట్టపరాశరులు మొదలుకొని యీవలివారు 'శరణాగతి' యని చెప్పంబడు 'ప్రపత్తి' మోక్షమునకు ముఖ్యసాధనమనియుందలంచి ప్రపత్తినే విశేషముగ నిరూపించిరి. వీరు నిరూపించినప్రకారమెట్లన:— "తస్మాన్న్యాసమేషాం తపసామతిరిక్తమాహుః" ఇత్యాది శ్రుతుల 'న్యాస' శబ్దవాచ్యమయిన ప్రపత్తికి సర్వాధిక్యమును ప్రతిపాదించుచున్నవి. "బ్రహ్మణేత్వామహస ఓమిత్యాత్మానం యుంజీత" అను శ్రుతిప్రపత్తియొక్క యనుష్ఠానక్రమమును బోధించుచున్నది. "ముమ

క్షుర్వై శరణమహం ప్రపద్యే" అను శ్రుతి, ప్రపత్తికి మోక్షోపాయ మును నిశ్చయింపుచున్నది. స్వరక్షణభరమును భగవంతునందు సమర్పించుట ప్రపత్తియనఁబడు. ఇదియే ఆత్మనిక్షేపమని వ్యవహరింపఁబడుచున్నది. దీనికి నైదంగములు కలవు :—(౧) అనుకూల్యసంకల్పము, (౨) ప్రాతికూల్యపరిత్యాగము, (3) రక్షించునను విశ్వాసము, (౪) రక్షకుఁడని వరించుట, (౫) తనయొక్క దీనత్వానుసంధానము. ఇదియే కార్పణ్యము. ఈయయిదంగములతోఁగూడిన ప్రపత్తి స్వరూపానురూపము. భక్తియోగమన్ననో, అహంకారగర్భితమైనందున స్వరూపవిరుద్ధము. (౧) పరమదయాకరుఁడగు భగవంతుని నాశ్రయించెదనను ప్రీతితోఁగూడిన తలంపు, అనుకూల్యసంకల్పము. (౨) అట్లాశ్రయించుటకుఁ బ్రతిబంధములగు నతి ప్రవృత్తిని, యత్నమును, విడుచుట ప్రాతికూల్యవర్జనము. (3) స్వామిత్వసౌలభ్య వాత్సల్యాది గుణములు కలవాఁడైనందున, శంకింపక తప్పక రక్షించునను నమ్మకము విశ్వాసము. (౪) నీవే నన్ను రక్షింపవలయునను బుద్ధితో రక్షకుఁడని వరించుట గోప్తృత్వవరణము. (౫) నేనశక్తుఁడను, నజ్ఞుఁడను, నన్ను నేను రక్షించుకొనఁజాలను; భగవంతునికంటె వేఱు రక్షకుఁడు లేఁడను దైన్యబుద్ధి కార్పణ్యము. (౬) నేను నీవాఁడను, నన్ను నిగ్రహించుటకుఁగాని, యనుగ్రహించుటకుఁగాని, నీవే కర్తవు, అను నిశ్చయజ్ఞానము కుదిరి, తనను, తన సంబంధ మన్నింటిని, భగవంతునకు సమర్పించుట, ఆత్మ సమర్పణము, లేక ఆత్మ నిక్షేపము. వీనిలో నాఱవది ప్రపత్తియను శరణాగతి. "ఆనుకూల్యస్య సంకల్పః ప్రాతికూల్యస్య వర్జనం రక్షిష్యతీతి విశ్వాసో గోప్తృత్వవరణంతథా ఆత్మనిక్షేప కార్పణ్యే షడ్విధాశరణాగతిః" ఇది ప్రపత్త్యంగ సంగ్రహ శ్లోకము. కర్మములను జేయలేనివాఁడు శరణాగతి కధికారి. ఈ ప్రపత్తి నిష్ఠుఁడు భగవదాజ్ఞారూపములగు వర్ణాశ్రమధర్మములను, యథాశక్తిని జీవించునంతకుఁ జేయుచు దేహయాత్ర కర్మాధీనమనియు, నాత్మయాత్ర (సద్గతి బొందించుట) యీశ్వరాధీనమనియు, నిశ్చయముతో నుండవలయు. భక్తిగాని ప్రపత్తిగాని మోక్షమునకు సాక్షాత్సాధనము. భక్తికి వర్ణా

శ్రమధర్మములు, వివేక విమోకాదులేడు, అష్టాంగయోగములు, శమ దమాదులు నంగములు. భక్తిద్వారమున, కర్మజ్ఞానములు మోక్షము నకుఁ బరంపరాకారణములు. శరణాగతి మోక్షమునకేగాక తదుపాయములకుఁ గలుగు ప్రతిబంధములయొక్క నివారణమునకుఁ గూడ నుపాయము.

—* ౧౧ జీవేశ్వర సంబంధములు ౯ *—

జీవుని స్వరూప మీశ్వరునితోఁ దొమ్మిది సంబంధములు కల దై యున్నది :—

(౧) వీనిలో మొదటిది పితృపుత్రసంబంధము. "యతో వా ఇమాని భూతాని జాయంతే, ఆత్మాదేవానాం జనితాప్రజా" మి త్యాది శ్రుతులు, ఈశ్వరునకు జగదుత్పాదకత్వమును బ్రతిపాదించుట చే జీవులకుఁ బుత్రత్వము సిద్ధించినది.

(౨) రెండవది రక్ష్య రక్షకసంబంధము :—"యేనజాతాని జీ వంతి, ఏషభూతపాలః" అను శ్రుతు లీశ్వరుఁడు జగద్రక్షకుఁడని చెప్పు చున్నందున జీవులకు రక్ష్యత్వము నన్వయింపఁదగియున్నది.

(3) మూఁడవది శేషశేషి సంబంధము. "పతింవిశ్వస్య, ఏష భూతాధిపతిః" ఇత్యాది శ్రుతు లీశ్వరుఁడు శేషియనుచున్నందున జీ వులు వానికి శేషభూతులనుటకు సంశయము కనఁబడదు. ఇచ్చట 'పతి' శబ్దము శేషివాచకముగాని, రక్షకవాచకము కాదని పూర్వమే ప్రతిపాదించితిని. "శేషఃపరార్థత్వాత్" అను జైమినిసూత్రమందు శేషిలక్షణము చెప్పఁబడినది. పూర్వాచార్యులా సూత్రము నిట్లు వివ రించిరి:—"ఇచ్ఛయాయదుపాదేయం యస్యాతిశయసిద్ధయే, ఉభయా నుభయైకైక జుషౌతౌ శేషశేషిణౌ"= శేషిశేషముల నిద్దఱియందుండు నిచ్ఛచేతఁ గాని, ఉభయ వ్యతిరిక్తుఁడైన తటస్థపురుషుని యందుండు నిచ్ఛచేతఁగాని, శేషిగ తేచ్ఛచేతఁగాని, శేషవస్తుగ తేచ్ఛచేతఁగాని, యేప దార్థ మేపదార్థముయొక్క యతిశయసిద్ధికొఱకు గ్రహింపఁబడునో,

ఆ రెండు క్రమముగా శేషి శేషు లనఁబడు. దీనిని దృష్టాంతములతో విశదపఱచెదను. 'రాజ్ఞః పురుషః' ఇత్యాదులందు రాజభృత్యులకు శేషి శేష భావము కలదు. రాజభృత్యు లిరువురు చేతనులగుటచే నిద్ద ఱు నిచ్ఛాశ్రయులు. రాజు తనకు నతిశయసిద్ధి నిచ్ఛయించి భృత్యు నిం బరిగ్రహించును. భృత్యుఁడు తనచే రాజున కతిశయము సిద్ధింప వలయుననునిచ్ఛచేతఁ బరిగ్రహింపఁబడును. కావున నిచ్చట నిచ్ఛ శేష శేష్యుభయగతము. "కుండలాయ హిరణ్య" మిత్యాదులయందుఁ గుండల సువర్ణములకు శేషి శేష భావము కన్పట్టుచున్నది. ఇచ్చటఁ గుండలహిరణ్యములు రెండు నచేతనము లయినందున నిచ్ఛాశ్రయము లు కానేరవు. తటస్థపురుషుఁడు కుండలమున కతిశయసిద్ధి హిరణ్యము వలనఁ గలుగునని యిచ్ఛయించి హిరణ్యమును గ్రహించును. కావున నిచ్చట నిచ్ఛ యనుభయగతము. అనఁగా తటస్థపురుషగతము. 'రాజ్ఞో గృహా' మిత్యాదులందు రాజగృహములందు శేషి శేష భావము కలదు. ఇచ్చట శేషియగు రాజు చేతనుఁ డైనందున నిచ్ఛాశ్రయుఁడు కావ చ్చును. కావున నిచట శేషిగతేచ్ఛ. "యజ్ఞాయ యజమానః" ఇ త్యాదులందు యజమాన యజ్ఞములు శేష శేషిభావము తోఁచుచు న్నది. ఇచ్చట శేషియగు యజ్ఞము క్రియామాత్ర మయినందున నది యిచ్ఛాశ్రయముకాదు. యజమానుఁ డిచ్ఛాశ్రయుఁడు కావున నిచట నిచ్ఛ శేషము నాశ్రయించియున్నది.

(౪) నాల్గవది భర్తృభార్యాసంబంధము. ఇది "అనన్యారాఘ వేణాహం శరైస్తు సంకులాంకృత్వా లంకాంపరబలార్దనః మాం నయే ద్యది కాకుత్స్థ స్తత్తస్య సదృశంభవేది"త్యాది శ్రీమద్రామాయణ వాక్యములందు వ్యంజనావృత్తిచేతఁ జేతనులు భగవదనన్యార్హత్వ భగవదేకరక్ష్యత్వములుకలవారని తోఁచుచున్నందున జీవులకు భార్యా త్వము, నీశ్వరునకు భర్తృత్వము, సిద్ధింపుచున్నది. ఇచట శ్రుతి మృగ్యము.

(౫) అయిదవది జ్ఞాతృజ్ఞేయ సంబంధము. ఇది "తమేవైకం

జానథాత్మాన మి"త్యాది శ్రుతులయందు జీవేశ్వరులకు వరుసగ జ్ఞాతృ జ్ఞేయత్వములు ప్రతిపాదింపఁబడినట్లు నిశ్చయింపవలెను.

(౬) ఆఱవది స్వస్వామిసంబంధము. ఇది సువర్ణరజతాదులవలె యథేష్టవినియోగార్హత్వము స్వత్వము. ఇది ''స్వత్వమాత్మనిసంజాతం స్వామిత్వం బ్రహ్మణిస్థితం"ఇత్యాది పాంచరాత్రాదిస్మృతివచనసిద్ధము. ఇచటఁ గూడ శ్రుతిమృగ్యము.

(౭) ఏడవది ఆధారాధేయసంబంధము. ఇది "యఆత్మా సేతు ర్విధృతిరేషాం లోకానామ సం భేదాయ" ఇత్యాది శ్రుతులం దీశ్వ రునకు జగద్ధారకత్వము చెప్పఁబడినందున సిద్ధించుచున్నది.

(౮) ఎనిమిదవది శరీ రాత్మసంబంధము. ఇది "సఆత్మా అంగా న్యన్యా దేవతాః, యస్యాత్మా శరీరం" ఇత్యాది శ్రుతి ప్రతిపాదితము.

(౯) తొమ్మిదవది భోక్తృభోగ్యసంబంధము. ఇది "అహమన్న మహమన్న" మిత్యాది శ్రుతులు ముక్తజీవులకీశ్వరభోగ్యమును జెప్పు చున్నందున నీశ్వరుఁడు భోక్తయని నిర్ణయింప నగు. ఇవి జీవేశ్వర నవవిధసంబంధములు.

౧౨. భక్తి ప్రపత్తివిశేషములు.

ఈ నవవిధసంబంధములు గల చేతనులకు స్వరక్షణభరసమ ర్పణరూపమును, స్వప్రయత్ననివృత్తిరూపమును, నగు శరణాగతియే స్వరూపానురూపసాధనమని ద్రావిడాచార్యుల తలంపు. కాని యీ మతము శ్రీరామానుజాచార్యసమ్మతముకాదని తోఁచుచున్నది. వారు శ్రీ భాష్యమునందు భక్తియోగమే మోక్షోపాయమనియు, నితరో పాయములు మోక్షోపయుక్తములు కావనియు, కంఠరవముతోఁ బ్రతిపాదించి యున్నారు. గద్యత్రయములోని శరణాగతి గద్య లో మాత్రము శరణాగతిని గనపఱచిరి. అయినను నా శరణా గతి భక్త్యంగముకాని స్వతంత్రోపాయము కాదని వారి తాత్ప ర్యము. శరణాగతి గద్యయందే పరభక్తి "పరజ్ఞాన పరమభక్త్యైకస్వ

భావం మాం కురు" అనియు, "నానావిధానంతాపచారాన్ సర్వానశేషతః క్షమస్వవిపరీతవృత్తంచా శేషవిషయం సర్వం క్షమస్వ" అనియుఁ, గొన్ని వాక్యములు కనఁబడుచున్నవి. వీనిని స్వరసముగ యోజించినచో శరణాగతి, భక్త్యుత్పత్తి సాధనమనియు, భక్త్యుత్పత్తిప్రతిబంధక ప్రాచీనదోషనివృత్త్యర్థమనియు, శ్రీ రామానుజాచార్యుల తాత్పర్య మూహింపఁదగియున్నది. "సర్వధర్మాన్ పరిత్యజ్య" అను భగవద్గీతాచరమ శ్లోకమునకు వారు రెండువిధములగు టీకలు వ్రాసిరి. మొదటిదానిలో భక్తియోగఫలప్రతిబంధనివృత్తి శరణాగతికిఁ ప్రయోజనమనియు, రెండవటీకలో కూశ్మాండవైశ్వానరవ్రాతపతిపవిత్రేష్ట్యాదులవలె శరణాగతి భక్త్యుత్పత్తి ప్రతిబంధక దురితనిబర్హణము ప్రయోజనమనియుఁ, జెప్పిరి. భక్తియోగమునకు నారంభవిరోధులు కలవని "ఏవంముక్తిఫలానియమస్తదవస్థావధృతేః" (బ్ర. సూ. 3 అ. 4 పా. 51) అను మూఁడవ యధ్యాయాంతిమ సూత్రముయొక్క శ్రీభాష్యము స్పష్టముగఁ జెప్పుచున్నది.

మఱియును, బ్రహ్మసూత్రములలో వివరింపఁబడిన ముఖ్యాంశములను చరమసూత్రమగు 'అనావృత్తిశ్శబ్దా దనావృత్తిశ్శబ్దాత్' అనుదానియొక్క భాష్యములో సంగ్రహించి సగుణబ్రహ్మోపాసకుఁడు ముక్తిని బొందిన తరువాతఁ దిరిగి సంసారమునకు రాఁడని యిట్లు వ్రాసిరి :—"ఎట్టిదోషములు లేనివాఁడును, సకలకల్యాణగుణములకు నివాస స్థానమును, జగజ్జన్మాదులకుఁ గారణమును, ఎల్లవస్తువులకంటె నన్యుఁడును, సర్వజ్ఞుఁడును, సత్యమగు సంకల్పము గలవాఁడును, ఆశ్రయించినవానియం దమితవాత్సల్యము కలవాఁడును, అందఱియందును మిక్కిలి దయఁగలవాఁడును, తనకంటెఁ దుల్యుఁడుకాని యధికుఁడుగాని లేనివాఁడును, నగు పరబ్రహ్మమను పేరుగలవాఁడు పరమపురుషుఁడు, (నారాయణుఁడు) అని శ్రుతులు నుడువుచున్నవి. మఱియు నాపరమపురుషు ననుదినము స్వధర్మానుష్ఠానానుగృహీతమగు(భక్తి) ఉపాసనముచేత నారాధించినచోఁ ప్రీతుఁడై యుపాసకులకు ననాదికాలమునుండి యున్నట్టియు, ధరింప శక్యముకాని యవిద్యాకార్యములగు కర్మబంధనము

లను, నివారించి, తన నిజస్వరూపానుభవమువలనఁ గలిగిన నిరవధికమగు నానందము వారికిఁ గలిగించి, మరల వారినిఁ బుట్టింపకుండఁ జేయునని యు, శ్రుతులు చెప్పుచున్నవి. శ్రుతి:—"సఖల్వేవంవర్తయన్యావదాయుషం బ్రహ్మలోకమభిసంపద్య తేనచపునరావర్తతే" దీని యర్థము ను భగవద్గీతలలోని (8 అ. 16 శ్లో) " ఆబ్రహ్మభవనాల్లోకాః పునరావర్తినోర్జున, మాముపేత్యతు కౌంతేయ పునర్జన్మనవిద్యతే " అను శ్లోకములో భగవంతులు స్వయముగ సెలవిచ్చిరి. మఱి యుఁ గర్మబంధనములనెల్ల నశింపఁజేసికొని పూర్ణజ్ఞానముఁ గలిగి తదేకప్రియుఁడై నిరవధికమగు నానంద మనుభవించువానికి మఱి యొకదానియందుఁ బ్రేమగాని, యత్నముగాని, కలుగదు గానఁ దిరిగి యీలోకమునకు వచ్చునేమోయను శంకయే కలుగదు. సత్య సంకల్పుఁడగు పరమపురుషుఁడు తనకు మిక్కిలి ప్రియుఁడును, ఆత్మస్వ రూపుఁడును, నయిన జ్ఞాని, తిరిగి పుట్టఁడని భగవంతులు స్వయముగ గీ. 7 అ. 18, 19 శ్లోకములలో నిట్లు సెలవిచ్చిరి :—"ఉదారాస్సర్వ ఏవైతే జ్ఞానీత్వాత్మైవమేమతం । ఆస్థితస్సహియుక్తాత్మా మామేవా నుత్తమాంగతిం. 18. బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్మాం ప్రప ద్యతే । వాసుదేవస్సర్వమితి సమహాత్మాసుదుర్లభః - 19". దీనిచే ననుదినము స్వధర్మానుష్ఠానఫలముగ భక్తితో పరమపురుషు నారా ధించి ప్రీతిని బడసిన యధికారికి జన్మపరంపరఁ దొలఁగునని భాష్య కారు లభిప్రాయపడినట్లు తోఁచఁగలదు.

ఇదిగాక ' తిరువాయిమొళికి ' నుత్తరవీధి భట్టాచార్యులచే రచింపఁబడి ద్రావిడాచార్యు లందఱచే నిప్పటికిని ప్రమాణితమని బహుంకరింపఁబడునట్టి ' షట్త్రింశత్సాహస్రిక ' అను గ్రంథమునందు మొదటిశతకములోని రెండవదశక వ్యాఖ్యానోపోద్ఘాతమున నిట్లు వ్రా యఁబడి యున్నది :—శ్రీభాష్యమును రచియింపకమున్ను భాష్యకా రులీ దశకమును ప్రపత్తిపరముగా నన్వయించి తరువాత భక్తిపరము గా నిర్వహించిరి. ఈవాక్యమునుబట్టి చూడఁగను శ్రీరామానుజాచార్యా భిప్రాయము భక్తియోగమే మోక్షోపాయమనుటయుందు నిశ్చయింపఁ

దగి యున్నది. కాని ద్రవిడములోనున్న శరణాగతి గద్యటీకలో, వారు భగవద్గీతాభాష్యములోని చరమశ్లోక వ్యాఖ్యలో శరణాగతి మోక్షమునకు సాక్షాత్సాధనమని వ్రాయకున్నను, వారి రహస్యాభిప్రాయ మట్లియనియున్నది. శ్రీభాష్యములో "భవతుమమపరస్మిన్ శేముషీ భక్తిరూపా" అను ప్రథమశ్లోకోక్తినిబట్టి భక్తియే మోక్షోపాయమని తోంచునుగాని, శ్రీభాష్యోత్తర కాలీనమైన శరణాగతి గద్యలో ప్రపత్తిని ముఖ్యోపాయముగ వ్రాసియుండుటచేతను, శ్రీభాష్యము వాదగ్రంథ మగుటచేతను, దానిలో భరన్యాసరూప ప్రపత్తిని జెప్పుట స్వోద్దేశ విరుద్ధమని యహంకార గర్భితమైన భక్తి ననలంబించినట్లు సహృదయులు చెప్పుచున్నారు. ద్రవిడ ప్రబంధములు, శ్రీమద్రామాయణమును, మోక్షమునకు శరణాగతియే ముఖ్యసాధనమని నుడువుచుండుటచే నామతమును భాష్యకారులు స్వీకరించిరా యను నూహాపోహముచున్నది. ప్రాసంగిక విచార మింతటితో విరమించి ప్రకృతమును నుడివెదను.

౧౩ —* తెంగలి వడగలి సిద్ధాంత భేదములు ౧౪ *—

భాష్యకారుల రెండవ శిష్యులగు వేదాంతోదయనాచార్యుల సంప్రదాయమందు విష్ణుచిత్తాచార్యులు విష్ణుపురాణవ్యాఖ్యానమును, ప్రమేయసంగ్రహమును, రచియించిరి. వీరి శిష్యులు వాత్స్య వరదాచార్యులు. వీరు ప్రమేయమాల, తత్త్వసారము, లోనగు గ్రంథములను నిర్మించిరి. వీరి శిష్యులు వ్యాసాచార్యులును, వాదిహంసాంబువాహాచార్యులును. వ్యాసాచార్యులు శ్రీభాష్యమునకు శ్రుతప్రకాశిక యను నొక విపులవ్యాఖ్యానమును, శ్రుతప్రదీపిక యను సంగ్రహవ్యాఖ్యయును, వేదార్థ సంగ్రహశరణాగతి గద్యాది వ్యాఖ్యానములను, రచియించిరి. వాదిహంసాంబువాహాచార్యులు న్యాయ కులిశాది గ్రంథములను రచియించిరి. వీరి శిష్యులు వేంకట నాథులు. వీరు సంస్కృతములో శతదూషణి, తత్త్వముక్తాకలాపము, అధికరణసారావళి, మొదలగు శాస్త్రగ్రంథములను, దయాశతకము లోనగు స్తోత్రములను, హంససందేశము, యాదవాభ్యుదయము, సంకల్పసూర్యోదయము, నను కావ్యనాటకములను, ద్రావిడభాషలో, రహస్యత్రయసార

ము మొదలగు 3౨ రహస్యగ్రంథములను, నింక ననేక గ్రంథములను రచియించిరి. వీరినే వేదాంతదేశికులని పిలుతురు. మఱియు వీరు, పిళ్ళలోకాచార్యులు శ్రీవచనభూషణాది గ్రంథములయందు నిర్ణయించిన యర్థవిశేషములలోఁ గొన్ని శ్రుతిస్మృతిసదాచారవిరుద్ధ ధర్మములని తలంచి, వానిని ఖండించిరి. అదిమొదలు ద్రావిడాచార్య సంస్కృతాచార్యులకు విరోధము వృద్ధినొందెను. వీరిద్దఱకు విప్రతిపత్తివిషయములయిన విశేషార్థములు (౧౮) పదునెనిమిది. అవి యెవ్వియన :— "భేదఃస్వామికృపాఫలాన్యగతిషు శ్రీవ్యాప్త్యుపాయత్వయోః తద్వాత్సల్యదయా నిరుక్తవచసోఃన్యాసేచతత్కర్తరి ధర్మత్యాగవిరోధయోఃస్వవిహితే న్యాసాంగహేయత్వయోః ప్రాయశ్చిత్తవిధౌతదీయభజనేఽణు వ్యాప్తి కైవల్యయోః", అని అష్టాదశార్థ సంగ్రాహక శ్లోకము.

(౧) భగవంతుఁడు పరమదయాళువయినందున, చేతనకృత్యము నపేక్షించినచో, వానియొక్క యవాప్త సమస్తకామత్వమునకు భంగము సంభవించును గాన భగవత్కృప నిర్హేతుకమై, చేతనుని పురుషార్థమునకు సాధనమగునని ద్రావిడాచార్యుల (తెంగలవారి) మతము. చేతనకృత్యము నపేక్షింపనియెడల సర్వులకు మోక్షము ప్రసక్తించుటవలనను, కొందఱకుఁ బురుషార్థమును గలుగఁజేసి, కొందఱకు గలుగఁజేయనిచో, భగవంతునకు వైషమ్యనైర్ఘృణ్యములు ప్రసక్తించుటవలనను, 'వైషమ్యనైర్ఘృణ్యేనసాపేక్షత్వాత్' అని బ్రహ్మసూత్రకారులు చెప్పియున్నందునను, భగవత్కృప సహేతుకమని సంస్కృతాచార్య (వడగలివారు) ల మతము.

(౨) చేతనుఁ డత్యంత పరతంత్రుఁడైనందున, చేతనునకుఁగలిగిన బ్రహ్మప్రాప్తి భగవంతునకే లాభముగాని చేతనునకుఁగాదు. చోరాపహృతద్రవ్యప్రాప్తి ధనస్వామికిఁ బురుషార్థముగాని ధనమునకు గాదుగదాయని ద్రావిడాచార్యమతము. ధనము అచేతనమయినందు స్వామిప్రాప్తి ధనమునకుఁ బురుషార్థము కాకపోవచ్చును. జీవుఁడు చేతనుఁడైనందున భగవత్ప్రాప్తి యతనికిఁ బురుషార్థము కాదనఁ

దు. భగవంతునకే పురుషార్థమయినచో భగవంతునియొక్క యవాప్త సమస్తకామత్వమునకు భంగమగునని సంస్కృతాచార్య మతము.

(3) శరణాగతివ్యతిరిక్తములయిన కర్మయోగ జ్ఞానయోగ భక్తియోగములు ప్రత్యేకప్రత్యేకము మోక్షసాధనములని ద్రావిడాచార్య మతము. ప్రపత్తియును భక్తియోగమునను రెండే మోక్షసాధనములుగాని కర్మయోగ జ్ఞానయోగములు సాక్షాన్మోక్షసాధనములు కావు, అవి భక్తియోగమున కంగములనియు, సంస్కృతాచార్యమతము.

(౪) తత్త్వములు మూఁడే (చిదచిదీశ్వరులు) యయినందున లక్ష్మి, జీవకోటిలోఁ జేరఁదగినదనియు, ఈశ్వరకోటిలోఁ జేర్చినచో నీశ్వర ద్విత్వము ప్రసక్తించుననియు, జీవస్వరూపమువలె లక్ష్మీస్వరూపమును, అణువే యనియు; "త్వయాచవిష్ణునాచాంబ వ్యాప్తమేతచ్చరాచర" మిత్యాది శాస్త్రప్రసిద్ధమయిన వ్యాప్తి ధర్మభూతజ్ఞానముచేతనే గాని స్వరూపముచేతఁ గాదని ద్రావిడాచార్యమతము. "అస్యేశానా జగతో విష్ణుపత్నీ" ఇత్యాదిశ్రుతులు లక్ష్మికి జగదీశ్వరత్వమును బ్రతిపాదించుచున్నందున లక్ష్మిని నీశ్వరకోటిలోఁ జేర్పవలయుననియు, నందువలననే ఆమెస్వరూపము విభువుగాన, స్వరూపముచేతనే చరాచరవ్యాప్తినిఁ జెప్పవచ్చుననియు, కాలతత్త్వమునకు విభుత్వము నంగీకరించినచో నీశ్వర ద్విత్వము సంభవించనట్లు, లక్ష్మికి విభుత్వము నంగీకరించినను, నీశ్వరద్విత్వము ప్రసక్తించ నేరదనియు, సంస్కృతాచార్య మతము.

(౫) మోక్షసాధనత్వము భగవంతునికేగాని లక్ష్మికి లేదనియు, భగవంతుఁడు మోక్షసాధనమగునపుడు లక్ష్మి, పురుషకారముగా నుండుననియు, లక్ష్మికి మోక్షసాధనత్వమును జెప్పినచో సాధన ద్విత్వము ప్రసక్తమగుననియు, నప్పుడు "త్వమేవోపాయభూతో మే భవమామేకం శరణంవ్రజ" ఇత్యాదివాక్యములందు 'ఏవకారైక'శబ్దములచే సూచింపఁబడిన యీశ్వరనిష్ఠసాధనైకత్వము బాధితమగుననియు, ద్రావిడాచార్యమతము. విష్ణుపురాణములోని ఇంద్రకృత శ్రీస్తుతియందు "విముక్తి

ఫలదాయినీ, సంసారార్ణవతారిణీ", ఇత్యాదివచనములు లక్ష్మికిగల మోక్షసాధనత్వమును జెప్పుచున్నందున లక్ష్మికిఁ బురుషకారత్వమేగాక మోక్షసాధనత్వముంగూడఁ గలదనియు, అగ్నిష్టోమాదులందు అగ్నిష్టోము లిద్దఱయినను ఉద్దేశ్యతావచ్ఛేదకైక్యము వలన నొకటియే యైనట్లు లక్ష్మీనారాయణులయొక్క మోక్షసాధనత్వ మొక్కటియనుటకు విరోధము లేదు గానను సాధనద్వైత్వదోషము ప్రసక్తింపదనియు, సంస్కృతాచార్యమతము.

(౬) భగవంతునియందు వాత్సల్యమను నొక గుణముకలదు. అది ఆశ్రితదోషముల నీశ్వరుండు భోగ్యముగ గ్రహించుటయే, • గోవు సద్యోజాతమగు (అప్పుడు పుట్టిన) తన వత్సము (దూడ) యొక్క మాలిన్యము (మాయ)ను భోగ్యముగా గ్రహించుట లేదా. "దోషో యద్యపి తస్యస్యాత్సతామేతద గర్హితం" అను శ్రీమద్రామచంద్రుల వాక్యమునం దాశ్రితదోష మగర్హిత (నింద్యముకాదు) మని చెప్పియున్నందున నది భోగ్యమనిసిద్ధిం చుచున్నదనియు ద్రావిడాచార్య మతము. ఆశ్రితదోషముల నుపేక్షించుటయే వాత్సల్యముగాని దోషభోగ్యత్వము కాదు. దోషభోగ్యత్వమనినచో భగవంతున కవద్యము సంభవించును. హేయాస్పదమగు గోవును నిరవద్యుఁడగు భగవంతునకు దృష్టాంతముగఁ జెప్పఁదగదు. ఉదాహృతరామాయణవచనమందును "అగర్హితం"=నింద్యముకాదని యున్నదిగాని భోగ్యమని చెప్పఁబడలేదు. కావున వాత్సల్యమనఁగ నాశ్రితదోష సహనమని సంస్కృతాచార్య మతము.

(౭) భగవన్నిష్ఠగుణములలో కారుణ్యమనఁగా పరదుఃఖదుఃఖిత్వము; "వ్యసనేషుమనుష్యాణాం భృశంభవతి దుఃఖితః" అని రామాయణమం దయోధ్యాకాండాదిలోఁ జెప్పఁబడియున్నదని ద్రావిడాచార మతము. పరదుఃఖాసహిష్ణుత్వమే కారుణ్యముగాని దుఃఖిత్వముగాదు దుఃఖిత్వమే యనినచో "విమృత్యుర్విశోకః" ఇత్యాది శ్రుతులు బాధితార్థములగును. కావున రామాయణవచనమునకు శ్రుత్యనుగుణమ

దుఃఖాసహిష్ణుత్వమే యర్థమని నిశ్చయింపవలయునని సంస్కృతాచార్యుల యభిమతము.

(౮) భగవత్ప్రయత్న విరోధి స్వప్రయత్న నివృత్తి శరణాగతి యనఁబడును. "సకృదేవ ప్రపన్నాయ' యను రామాయణ వచనము నుబట్టి ప్రపత్తిసకృత్కర్తవ్య (ఒకపర్యాయముమాత్రమే చేయఁదగినది) మని ద్రావిడాచార్యమతము. స్వరక్షణభర సమర్పణము శరణాగతి. స్వప్రయత్ననివృత్తియు, ప్రాతికూల్యవర్జనమును, శరణాగత్యంగములలో నంతర్భూతములు. "ఓమిత్యాత్మానం యుంజీత" అనుశరణాగతిప్రయోగమం'దాత్మసమర్పణము ప్రదర్శింపఁబడియున్నది. ఇది యసకృత్కర్తవ్యము(పలుమాఱు చేయఁదగినది). శరణాగతిమంత్రమందు 'ప్రపద్యే' అనుపదము వర్తమానాపదేశమయియుండిశరణాగతి సర్వదాఅనుష్ఠేయమనిసూచింపుచున్నది. "సకృదేవప్రపన్నాయ" అనువచనమందు'ఏవ' కారము భిన్నక్రమము. ఒకమాఱు ప్రపత్తిచేసినవానికే యభయమిచ్చుచున్నాను, అనేకపర్యాయములు చేసినవానికి నేమిచెప్పవలయునని తదభిప్రాయమని, సంస్కృతాచార్యమతము.

(౯) మహావిశ్వాసశాలి ప్రపత్తికి నధికారి, విశ్వాసమాంద్యము గలవాఁడు భక్తియోగమునకధికారి, యనియు ద్రావిడాచార్యమతము. భక్తియోగానుష్ఠానమం దశక్తుఁడు ప్రపత్త్యధికారి, శక్తుఁడు భక్తియోగమం దధికారి, యని సంస్కృతాచార్యమతము.

(౧౦) "సర్వధర్మాన్ పరిత్యజ్య" అనుచరమశ్లోకమందుఁజెప్పబడిన కర్మయోగాది ధర్మపరిత్యాగము ఉపాయత్వేనస్వరూపత్యాగమని ద్రావిడాచార్యమతము. ఫలపరిత్యాగమేకాని స్వరూపపరిత్యాగము కాదనియు, స్వరూపపరిత్యాగ మనినచో "శ్రుతిస్స్మృతిర్మమైవాజ్ఞా యస్తా ముల్లంఘ్యవర్తతే ఆజ్ఞా ఛేదీ మమద్రోహీ మద్భక్తోపిన వైష్ణవః" ఇత్యాది ప్రమాణములకు విరోధము వచ్చునని సంస్కృతాచార్యమతము.

(౧౧) "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" అను భగవద్వచనము ఉపాయత్వేన సర్వధర్మస్వరూపత్యాగము, శరణాగత్యంగమని చెప్పినందున, త్యాగము ప్రపత్త్యంగమని ద్రావిడాచార్య మతము. సర్వధర్మస్వరూపత్యాగము ప్రపత్త్యంగమనినచో భగవత్ క్షేత్రవాసశిఖాయజ్ఞోపవీతోర్ధ్వపుండ్రాది ధారణాదులకును, నిత్యనైమిత్తికాది కర్మములకును, స్వరూపత్యాగము ప్రాప్తించును గావున తాదృశత్యాగము ప్రపత్త్యంగము కాదనియు, "సర్వధర్మాన్ పరిత్యజ్య" అను వాక్యమునకు కర్మయోగాదులలో నొకదానినయినను ప్రపత్త్యంగముగ స్వీకరింపదగదని తాత్పర్యమనియు, సంస్కృతాచార్య మతము.

(౧౨) ప్రపత్తినిష్ఠుండు నిషిద్ధముల నాచరించినపుడు పూర్వకృతశరణాగతిని స్మరించిన చాలునే కాని, మన్వాదిస్మృత్యుక్తప్రతిపదోక్త ప్రాయశ్చిత్తముల నాచరింపదగదని ద్రావిడాచార్యమతము. బుద్ధిపూర్వకముగ నిషిద్ధముల నాచరించినయెడల ప్రపన్నుడు కూడ ప్రతిపదోక్తప్రాయశ్చిత్తముల నాచరించి తీరవలయుననియు, అబుద్ధిపూర్వకముగ నిషిద్ధములు ప్రాప్తించినపుడు ప్రపన్నుడు ప్రతిపదోక్త ప్రాయశ్చిత్తాచరణమునకు నశక్తుండయి యుండి యీ శరణాగతిని యథావిధిగ ననుష్ఠింపవలయుననియు, పూర్వకృతశరణాగతి స్మరణము చాలదనియు. "అశక్తు సంక్షేపే సద్యః ప్రాయశ్చిత్తం సమాచరేత్" "ప్రాయశ్చిత్తిరియం సాత్రయత్పునశ్శరణం వ్రజేత్" అను పాంచరాత్రవచనము దీనికి ప్రమాణములనియు, సంస్కృతాచార్య మతము.

(౧౩) ప్రపన్నుడు శాస్త్రవిహిత కర్మములాచరించుట యితరులాచరించు నిమిత్తమని ద్రావిడాచార్య మతము. ప్రపన్నుడు శాస్త్రవిహిత కర్మముల నాచరించుట భగవదాజ్ఞ ననుసరించి భగవత్ప్రీతి కొఱకని సంస్కృతాచార్య మతము.

(౧౪) ప్రపన్నుడు ప్రపత్తికి బూర్వ ధర్మములయిన వానిని నాచరింప నవసరముండదని ద్రావిడాచార్య మతము. ప్రపన్నునకు

ప్రపత్తికిఁ బూర్వధర్మములు ప్రపత్తికి అంగములై యుండుటంబట్టి యాచరింపవలయునని సంస్కృతాచార్యమతము.

(౧౫) ప్రపన్నుల కందఱకును భగవదనుగ్రహము కలుగదని ద్రావిడాచార్య మతము. ప్రపన్నుల కందఱకును భగవదనుగ్రహము కలుగునని సంస్కృతాచార్య మతము.

(౧౬) శూద్రజాతీయుఁడు ప్రపన్నుఁడైనచో నతఁడు బ్రాహ్మణజాతీయప్రపన్నునికంటె నుత్తముఁడనియు, బ్రాహ్మణజాతీయప్రపన్నుఁడా శూద్రజాతీయప్రపన్నుని ప్రణామకరణతీర్థప్రసాదాదిస్వీకారములనుఁ జేసి, యనువర్తింపవలయుననియు, అట్లనువర్తించినంగాని బ్రాహ్మణజాతీయుఁ డహంకారజాతిదోషము నశింపదనియు, జాతిదోషము నశించినఁగాని ముక్తియోగ్యుఁడు కాఁడనియు, "భక్తిరష్టవిధా ప్రోక్తా యస్మిన్ మ్లేచ్ఛేపి వర్తతే సవిప్రేంద్రో మునిః శ్రీమాన్ సయతిస్సచపండితః, తస్మై దేయం తతో గ్రాహ్యం సచపూజ్యో యథాహ్యహం" ఇత్యాదివచనము లిందులకుఁ బ్రమాణములనియు, ద్రావిడాచార్యమతము.

శూద్రజాతీయుఁడు ప్రపన్నుఁడైనను, బ్రాహ్మణజాతిప్రపన్నునికంటె నుత్తముఁడు కాఁడనియు, కేవలశూద్రునకును, కేవల బ్రాహ్మణునకును, గల తారతమ్యము తత్తజ్జాతీయప్రపన్నులకుఁగూడఁ గలదనియు, లేదనినచో శూద్రజాతీయప్రపన్నుఁ డిట్లు వర్తింపవలయు, బ్రాహ్మణజాతీయప్రపన్నుఁ డిట్లు వర్తింపవలయునను శాస్త్రవచనముల ప్రమాణములు కావలసివచ్చును. 'తస్మై దేయ' మిత్యాది వచనములకుఁ బ్రపన్నశూద్రుని సామాన్యశూద్రునివలె ననాదరింపఁ దగదనుటయే యదుఁ దాత్పర్యమనియు, నతనికిఁ బ్రణామాదులను జేయఁగూడదనియు, సంస్కృతాచార్య మతము.

(౧౭) ఈశ్వరుఁడు సర్వప్రపంచమునకు బాహ్యాభ్యంతరముల యందు వ్యాపించియున్నట్లు బహుశ్రుతులు చెప్పుచున్నందునను, జీవు

[illegible] శాస్త్ర[illegible]రములు దీక్షితుడు వ్యాఖ్యానించియుండునని యు, [illegible] ననుసరించి [illegible] సత్ప్రతిష్ఠాత్రద్రవ్య[illegible] దీప ము [illegible]పాంతగమం [illegible] చేసినట్లు [illegible]రుడు జీవుని [illegible] ప్రవేశించియుండునని యు, ద్రావిడాచార్య [illegible] స్వరూపప్ర[illegible] గకుండ [illegible] యు, [illegible] త్వమునకు భంగము [illegible] నదియు, [illegible] వ్యము [illegible] దృష్టాంత[illegible] కాదనియు, [illegible] దశ[illegible] [illegible] ర్థమించియు [illegible] [illegible] వ్యాప్తియనియు, [illegible]

([illegible]) [illegible] [illegible] [illegible] [illegible] ప్ర[illegible] ద్ర[illegible] [illegible] [illegible] బహ్మం [illegible] ([illegible] [illegible] ద్రావిడాచార్య [illegible] ప్రవిద్య బ్రహ్మ[illegible] కేవల [illegible] కాదు. కేవ [illegible] బ్రహ్మ[illegible] విర [illegible] కేవల[illegible] [illegible] [illegible] [illegible] చార్యమతము.

[illegible] [illegible] [illegible] వివాదవిషయము [illegible] [illegible] [illegible] [illegible]నుష్ఠాన, [illegible] [illegible] [illegible] [illegible] విరలకు [illegible] [illegible] వ్యాఖ్యానము [illegible] తద్వివరణము [illegible] [illegible] ప్రతిష్ఠా[illegible]సంగ్రహా [illegible] [illegible]

ఇతి శివం.